పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 720 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శుక్రవారం 18.09.2026 పేజీలు : 8 వెల : 4/-

## వారణాసిలో... చంద్రబాబు ప్రత్యేక పూజలు

**వారణాసిలో కాశీ విశ్వనాథుని దర్శించుకున్న సీఎం చంద్రబాబు**

- ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై జరిగిన సేవాయాత్రలో పాల్గొన్న బాబు
- కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగితో కలిసి పూజలు
- స్వామివారికి పవిత్ర జలాలతో అభిషేకం చేసి, భక్తులకు ప్రసాదం పంపిణీ
- చంద్రబాబు వెంట టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్

2లో





## మోదీ బర్త్‌డే: లోకేశ్ 'ఆశీర్వాద దీపం'

- ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు
- ఉండవల్లిలోని తన నివాసంలో 'ఆశీర్వాద దీపం' వెలిగించిన లోకేశ్
- మోదీకి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థన
- మోదీ నాయకత్వంలో దేశం వికసిత భారత్ వైపు సాగుతోందని ప్రశంసలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో 'నమో 76' అంటూ 'ఆశీర్వాద దీపం' వెలిగించి, ప్రధాని సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి జన్మదినం సందర్భంగా, ఆయన ఆయురారోగ్యాలతో, శక్తిసామర్థ్యాలతో దేశానికి చిరకాలం సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మా నివాసంలో ఆశీర్వాద దీపం వెలిగించాను" అని లోకేశ్ పేర్కొన్నారు.

తరువాయి 2లో

## ముంబైలో ట్రంప్ తనయ సందడి

- ముంబైలో జరిగిన గణేశ్ వేడుకల్లో పాల్గొన్న ట్రంప్ కుమార్తె టిఫానీ
- పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ నివాసంలో జరిగిన ఉత్సవాలకు హాజరు
- భారతీయ సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన టిఫానీ
- "లవ్ ఇండియా" క్యాప్షన్‌తో సోషల్ మీడియాలో ఫొటోలు షేర్
- ట్రంప్ రెండో భార్య మార్లా మాపుల్స్ కుమార్తె టిఫానీ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె టిఫనీ అరియానా ట్రంప్, ముంబైలో నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ నివాసంలో జరిగిన ఈ ఉత్సవాలకు ఆమె హాజరై సందడి చేశారు. ముఖ్యంగా ఈ వేడుకల్లో టిఫనీ భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమం అనంతరం టిఫనీ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వేడుకలకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. ఆ ఫొటోలకు 'లవ్ ఇండియా' అనే క్యాప్షన్‌ను జత చేయడం విశేషం. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన ఈ పోస్ట్ సామాజిక

తరువాయి 2లో



## 33 గంటల జర్నీ.. ప్రయాణికులకు ఉచిత భోజనం

- సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణి కులకు ఉచిత భోజనం
- 2,000 కిలోమీటర్లకు పైగా సాగే రైలు ప్రయాణం
- న్యూఢిల్లీ సహా పలు స్టేషన్లలో లంగర్ ఏర్పాటు
- అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేత
- అన్ని తరగతుల ప్రయాణికులకు ఒకే భోజనం
- దాతలు, స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో సేవ

రైలు ప్రయాణం అంటే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది స్టేషన్లలో దొరికే ఆహారం, ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం, రైల్లో అమ్మే మీల్స్. కానీ ఓ రైలులో మాత్రం ప్రయాణికులకు ఉచితంగా భోజనం అందుతుంది. అది కూడా ఒక్కసారి కాదు.. దాదాపు 33 గంటల సుదీర్ఘ ప్రయాణంలో

తరువాయి 2లో

## జేఈఈ మెయిన్-2027 షెడ్యూల్ ఖరారు

- వచ్చే ఏడాది రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ
- జనవరి 22 నుంచి తొలి విడత పరీక్షలు
- ఏప్రిల్ లో సెకండ్ సెషన్ పరీక్షలు
- అక్టోబర్ 2026లో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు
- యూజీసీ నెట్, క్యూయెట్ పీజీ తేదీలు కూడా ఖరారు

2లో






## మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు మస్ట్: కేంద్రం

2లో

- ప్రిస్క్రిప్షన్ మందుల విక్రయాలపై సీసీటీవీ నిఘాకు కేంద్రం ప్రతిపాదన
- రికార్డులు కనీసం మూడు నెలలు భద్రపరచాలని సూచన
- హోల్‌సేల్ వ్యాపారులకు మాత్రం మినహాయింపునిచ్చేలా ముసాయిదా
- షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్‌కే కాకుండా ఇతర మందులకు కూడా
- ఓవర్ ద కౌంటర్‌లో అక్రమ విక్రయాలను అరికట్టడమే లక్ష్యం

## రికార్డు వృద్ధి.. భారత్‌పై గ్లోబల్ నమ్మకం

- సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- భారత్ ఆర్థిక వృద్ధి, ప్రపంచ విశ్వాసానికి సెమీకండక్టర్ల రంగం నిదర్శనమని వ్యాఖ్య
- ప్రపంచమంతా భారత చిప్స్ వెళతాయని ధీమా వ్యక్తం చేసిన మోదీ
- సెమీకాన్ 2.0 కింద 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లకు మద్దతిస్తామని వెల్లడి
- నాలుగేళ్లలోనే 70,000 మంది డిజైన్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామన్న అశ్విని వైష్ణవ్

2లో



## ప్రధాని మోదీకి చంద్రబాబు, లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు



- మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ చరిత్రాత్మకమని కొనియాడిన టీడీపీ అధినేత
- ప్రధాని స్ఫూర్తిదాయక ప్రస్థానాన్ని ప్రశంసించిన నారా లోకేశ్
- దేశాభివృద్ధికి మోదీ నాయకత్వం కొత్త ఊపునిచ్చిందని వ్యాఖ్య
- వారణాసిలో ప్రధాని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొననున్న చంద్రబాబు

2లో

# 33 గంటల జర్నీ.. ప్రయాణికులకు ఉచిత భోజనం

రైలు ప్రయాణం అంటే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది స్టేషన్లలో దొరికే ఆహారం, ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం, రైల్లో అమ్మే మీల్స్. కానీ ఓ రైలులో మాత్రం ప్రయాణికులకు ఉచితంగా భోజనం అందుతుంది. అది కూడా ఒక్కసారి కాదు.. దాదాపు 33 గంటల సుదీర్ఘ ప్రయాణంలో పలుసార్లు ఉచిత భోజనం అందుతుంది. అదే మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు నడిచే సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్. ఈ ఉచిత భోజన సర్వీస్ భారతీయ రైల్వే, లేదా ఐఆర్‌సీటీసీ ఇస్తున్న సదుపాయం కాదు. సిక్కుల రెండు పవిత్ర క్షేత్రాలను కలిపే ఈ రైలు ప్రయాణంలో దశాబ్దాలుగా 'లంగర్' అందించే సంప్రదాయం కొనసాగుతోంది. నాందేడ్‌లో తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ సాహిబ్ ఉంది. అమృత్‌సర్‌లో స్వర్ణ దేవాలయంగా పేరొందిన హర్మందిర్ సాహిబ్ ఉంది. ఈ రెండు పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ కీలక రవాణా మార్గంగా ఉంది.

**దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం**

తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ సాహిబ్ అధికారిక వెబ్‌సైట్, టైమ్స్ ఆఫ్ ఇండియా కథనాల ప్రకారం.. ఈ రైలులో ప్రయాణికులకు ఉచిత లంగర్ అందించే సంప్రదాయం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. రైల్వేలో ఎన్నో మార్పులు వచ్చినా ఈ సేవ మాత్రం ఆగలేదు. సేవాభావం, దాతృత్వం, అందరికీ సమానంగా భోజనం అందించాలనే సిక్కు సంప్రదాయాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

**2,000 కిలోమీటర్ల ప్రయాణంలో..**

సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ 2,000 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తుంది. దాదాపు 39 స్టేషన్లలో ఆగుతుంది. సుమారు 33 గంటల ఈ ప్రయాణంలో న్యూఢిల్లీ, భోపాల్, పర్భణి, జాల్నా, ఔరంగాబాద్ వంటి ప్రధాన స్టేషన్ల వద్ద లంగర్ ఏర్పాటు చేస్తారు. ప్రయాణికులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందిస్తారు.

**అందరికీ ఒకే భోజనం**

లంగర్ అంటే సామూహిక వంటశాల. ఇందులో కులం, మతం, ఆర్థిక స్థాయి, సామాజిక హోదాతో సంబంధం లేకుండా అందరికీ భోజనం పెడతారు. సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇదే విధానం కనిపిస్తుంది. జనరల్ కోచ్‌లో ప్రయాణించే వారైనా, ఏసీ బోగీల్లో ఉన్నవారైనా ఒకే భోజనం అందుకుంటారు.

**సాధారణమైనా కడుపు నింపేలా..**

లంగర్‌లో సాధారణంగా పప్పు, శనగలతో చేసిన కూర, వేడి కిచిడీ, ఆలుగడ్డ కూర, కాలీఫ్లవర్ వంటి కూరగాయల వంటకాలు ఉంటాయి. ప్రయాణికులు తమ ప్లేట్లు లేదా డబ్బాలు తెచ్చుకుని భోజనం తీసుకుంటారు. దీంతో వ్యర్థాలు తగ్గడంతో పాటు పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యం లభిస్తుంది. ఈ సేవకు వివిధ గురుద్వారాలకు చెందిన దాతలు, స్వచ్ఛంద కార్యకర్తలు సహకరిస్తారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఇతరులకు సేవ చేయాలనే 'సేవా' భావన ఇందులో కనిపిస్తుంది. అందుకే సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణం చాలామందికి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే ప్రయాణం మాత్రమే కాదు. భక్తి, సేవ, సమానత్వాన్ని అనుభవించే ప్రత్యేక అనుభవంగా మారుతోంది.

## ముంబైలో ట్రంప్ తనయ సందడి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె టిఫనీ అరియానా ట్రంప్, ముంబైలో నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ నివాసంలో జరిగిన ఈ ఉత్సవాలకు ఆమె హాజరై సందడి చేశారు. ముఖ్యంగా ఈ వేడుకల్లో టిఫనీ భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమం అనంతరం టిఫనీ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వేడుకలకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. ఆ ఫొటోలకు 'లవ్ ఇండియా' అనే క్యాప్షన్‌ను జత చేయడం విశేషం. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. టిఫనీ ట్రంప్, డొనాల్డ్ ట్రంప్ రెండో భార్య మార్లా మాపుల్స్ కుమార్తె. గతంలోనూ పలువురు అంతర్జాతీయ ప్రముఖులు అంబానీ కుటుంబం నిర్వహించే వేడుకలకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా ఆ జాబితాలో టిఫనీ కూడా చేరారు.

## జేఈఈ మెయిన్-2027 షెడ్యూల్ ఖరారు

దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ 2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షల తేదీలను ముందుస్తుగానే ప్రకటించింది. వచ్చే ఏడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్ 2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టీఏ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం. జేఈఈ మెయిన్‌తో పాటు మరికొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. దీని ప్రకారం, యూజీసీ నెట్ (UGC NET) పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (CUET PG) 2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

## రికార్డు వృద్ధి.. భారత్‌పై గ్లోబల్ నమ్మకం: పీఎం మోదీ

ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు. సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే 'భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి' అన్నది వాస్తవరూపం దాల్చనుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'సెమీకాన్ 2.0' కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలు, ముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు. సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్‌డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85,000 మంది డిజైన్ ఇంజనీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70,000 మందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన సగర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

## మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు మస్ట్: కేంద్రం

డాక్టర్ల సిఫార్సుతో విక్రయించే మందులపై కేంద్రం మరింత కఠిన నిఘాకు సిద్ధమవుతోంది. మందుల దుకాణాలు, ఇతర లైసెన్స్ పొందిన రిటైల్ కేంద్రాల్లో ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు విక్రయించే సమయంలో సీసీ కెమెరా నిఘా తప్పనిసరి చేసే ప్రతిపాదనను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీసుకొచ్చింది. సెప్టెంబర్ 8న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం.. రిజిస్టర్డ్ వైద్యుడు సూచించిన ఏదైనా మందును హోల్‌సేల్ విక్రయాలు మినహా ఇతర మార్గాల్లో సరఫరా చేసే సమయంలో లైసెన్స్ పొందిన ప్రాంగణంలో సీసీటీవీ వ్యవస్థ పనిచేస్తూ ఉండాలి. మందు విక్రయం జరిగిందని ధ్రువీకరించుకునేలా రికార్డింగ్ ఉండాలి. ఈ దృశ్యాలను కనీసం మూడు నెలల పాటు భద్రపరచాలని ప్రతిపాదించారు. ప్రిస్క్రిప్షన్ అవసరమైన మందులను కొన్ని చోట్ల సరైన వైద్య సూచన లేకుండానే విక్రయిస్తున్నారన్న ఆందోళనల నేపథ్యంలో ఈ ప్రతిపాదన వచ్చింది. మందుల విక్రయంలో బాధ్యతను పెంచడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో అధికారులు తనిఖీ చేసేందుకు ఈ రికార్డులు ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ నిబంధన షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ మందులకే పరిమితం కాదు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌తో సరఫరా చేసే మందులన్నింటికీ వర్తించేలా ముసాయిదాలో పేర్కొన్నారు. అయితే హోల్‌సేల్ వ్యాపారులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది. ఇటీవల దగ్గు సిరప్‌ల విక్రయాలపై నిబంధనలు కఠినతరం చేసిన నేపథ్యంలో తాజా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా పిల్లలు, పెద్దలకు ఉద్దేశించిన కొన్ని మందులు సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఇవ్వడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వయసు, ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా మందు, మోతాదు నిర్ణయించాల్సిన అవసరం ఉండటంతో ఈ అంశంపై కేంద్రం దృష్టి సారించింది. అయితే సీసీటీవీ నిబంధన ఇంకా అమల్లోకి రాలేదు. ఇది కేవలం ముసాయిదా మాత్రమే. ప్రతిపాదనపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన తర్వాత కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది. గెజిట్‌లో తుది నిబంధనలు ప్రచురించినప్పుడు ప్రభుత్వం పేర్కొనే తేదీ నుంచి మాత్రమే కొత్త నిబంధన అమల్లోకి వస్తుంది.

## మోదీకి చంద్రబాబు, లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం సోషల్ మీడియా వేదికగా వారు తమ సందేశాలను పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, సుదీర్ఘకాలం సేవలందిస్తున్న ప్రధానిగా మీ నాయకత్వం చరిత్రాత్మకం. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా సుమారు 25 ఏళ్ల మీ ఆదర్శప్రాయమైన ప్రజాసేవ భారత ప్రగతి ప్రస్థానానికి నూతనోత్తేజాన్ని అందించింది. 'సేవ, సంకల్ప్, సుశాసన్' అనే మీ దార్శనికత 140 కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తినిస్తోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. దేశ సేవలో ప్రధాని మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని, ఆయనకు శ్రీ వేంకటేశ్వరస్వామి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. నారా లోకేశ్ సైతం ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. "సాధారణ నేపథ్యం నుంచి ఎదిగి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహిస్తున్న మీ ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. మీలోని అపారమైన శక్తి, క్రమశిక్షణ, దేశాభివృద్ధి పట్ల మీకున్న అచంచలమైన నిబద్ధత ప్రజాక్షేత్రంలో ఉన్న మా వంటి లక్షలాది మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయి" అని కొనియాడారు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో నిర్వహించనున్న 'సేవా సంకల్ప్' వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

## మోదీ బర్త్‌డే... లోకేశ్ 'ఆశీర్వాద దీపం'



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో 'నమో 76' అంటూ 'ఆశీర్వాద దీపం' వెలిగించి, ప్రధాని సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి జన్మదినం సందర్భంగా, ఆయన ఆయురారోగ్యాలతో, శక్తిసామర్థ్యాలతో దేశానికి చిరకాలం సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మా నివాసంలో ఆశీర్వాద దీపం వెలిగించాను" అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సరైన దిశలో పయనిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. "అభివృద్ధి, సాధికారత, 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' స్ఫూర్తితో మోదీ గారి సారథ్యంలో భారతదేశం 'వికసిత భారత్' లక్ష్యం దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది. ఆయన మన దేశాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు నడిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తన సందేశంలో తెలిపారు. ఈ మేరకు ఫొటోలను లోకేశ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## వారణాసిలో చంద్రబాబు ప్రత్యేక పూజలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కాశీ విశ్వనాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వారణాసిలో "వాద్‌నగర్ సేవాయాత్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చంద్రబాబు వారణాసి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న చంద్రబాబుకు పండితులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, ఇతర ప్రముఖులు గర్భగుడిలో కాశీ విశ్వనాథునికి పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. పూజల ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు, యూపీ సీఎం యోగి కలిసి ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్‌కుమార్ కూడా ఉన్నారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో జరిగిన ఈ కీలక కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## సంపాదకీయం

### వీర తెలంగాణ

# చేరని గుర్తింపు.. చెరగని చరిత్ర

తెలంగాణ ఇండియన్ యూనియన్‌లో విలీనమైన రోజును పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం 'ప్రజాపాలన దినోత్సవం' నిర్వహించింది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధులను స్మరించుకుంటూ ప్రపంచం గర్వించే స్థాయిలో తెలంగాణను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎవరా యోధులు? కనీసం ఒక్కరి పేరు కూడా చెప్పలేదు. పోరాటాల పురిటిగడ్డ కోసం అసువులు బాసిన అమరవీరుల బలిదానాల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని గుర్తించకపోవడం కిందకే వస్తుంది. నిజాంకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ చేసిన రైతాంగ పోరాటం గురించి నేటి తరానికి తెలియజేసే బాధ్యత ఈ ప్రభుత్వాలకు లేదా? భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ చరిత్రలోనే స్థానం సంపాదించుకుంది; కానీ తెలంగాణలోని పాలకులు మాత్రం ఆ పోరాటాన్ని గుర్తించడానికి ఇష్టపడటం లేదు. 'భూమి కోసం, భుక్తి కోసం', నిజాం నిరంకుశ పాలనలో నలిగిపోతున్న అట్టడుగు వర్గాల విముక్తి కోసం జరిగిన పోరాటం అది. 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో సాగిన రైతాంగ పోరాటం వలన పది లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కింది; నాలుగు వేల మంది అమరులయ్యారు. 'బాంచన్ దొర' అన్న నోటితోనే 'వీర తెలంగాణ విప్లవ పోరాటం వర్ధిల్లాలి' అని నినదించారు. 'కాల్మొక్కుతా దొరా' అంటూ తనను అంటుకోనియ్యని దొరల కాళ్ళకు దండం పెట్టిన చేతులే గడీలను బద్దలు కొట్టాయి. ఆ పోరాటం ఒక్క నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మాత్రమే సాగలేదు; నిజాంతో చేతులు కలిపిన దొరలను తరిమికొట్టడానికి ప్రజావాహిని కదిలింది. ఆ ప్రజావాహినిని నడిపింది కమ్యూనిస్టు పార్టీ. భారత ప్రభుత్వం తలపెట్టిన సైనిక చర్యకు ముందే నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడటం మొదలైంది. ఇండియన్ యూనియన్ సైనిక బలగాలు వస్తున్నాయి అనగానే నిజాం తెల్లజెండా చూపడానికి కారణం ఈ సాయుధ పోరాటమే. నాలుగు వేల మంది అమరుల బలిదానానికి ప్రతీక తెలంగాణ విమోచన. వారిని తలచుకునే ఉద్దేశం లేనప్పుడు ప్రభుత్వాలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వృథా. ఒకరు విలీన దినోత్సవం అంటారు, మరొకరు విమోచన దినం అంటారు, ఇంకొకరు ప్రజాపాలన దినం అంటారు. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న భారతీయ జనతా పార్టీ అయితే సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు తప్ప నాటి ప్రధానమంత్రి ప్రస్తావనే తీసుకురాదు. పటేల్ ఒక్కరే సైనిక చర్య చేపట్టే నిర్ణయం తీసుకుంటారా? మోదీ అనుమతి లేకుండానే అమిత్ షా నిర్ణయాలు తీసుకుంటారా? అందునా అప్పటికి అమలులో ఉన్న చట్టం ప్రకారం సంస్థానాలు భారతదేశంలో విలీనం అవ్వడం, అవ్వకపోవడం అనేది వాటి ఇష్టంపైనే ఆధారపడి ఉంది. ఇండిపెండెన్స్ యాక్ట్ 1947 ప్రకారం సంస్థానాలు పాకిస్తాన్‌తో కలుస్తున్నా అభ్యంతరం పెట్టలేని పరిస్థితి. హైదరాబాద్ సంస్థానం మీద సైనిక చర్య చేపట్టడమంటే వేరే దేశం మీద యుద్ధం ప్రకటించినట్లుగానే అంతర్జాతీయ సమాజం భావించే పరిస్థితి నెలకొంది. కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించిన దేశానికి ప్రధానమంత్రిగా ఉన్న వ్యక్తి ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించవలసిన ఆవశ్యకత ఉంటుంది. 'ఆపరేషన్ సింధూర్' సమయం నుండి ట్రంప్ చేసే ప్రేలాపనలకు మోదీ గట్టి సమాధానం చెప్పాలని ప్రజలు, ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయి. మన సార్వభౌమాధికారంలో ట్రంప్ జోక్యం చేసుకోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. అయినా మోదీ ఎందుకు సంయమనం పాటిస్తున్నారు అంటే—ఈ ఒక్క విషయంతో అమెరికాతో తెగతెంపులు చేసుకునే పరిస్థితి లేదు కాబట్టి, వాణిజ్య సంబంధాలు కొనసాగవలసిన అవసరం ఉంది కాబట్టి మోదీ సంయమనంతో ఆలోచిస్తున్నారు అని ప్రజలు సరిపెట్టుకుంటున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం నాడు ఇందిరాగాంధీ అమెరికాను కాదని రష్యా వైపు నిలబడ్డారని చెబుతూ ఉంటుంది; అది కూడా వాస్తవమే. ప్రచ్ఛన్న యుద్ధం ప్రపంచాన్ని వణికించే రోజుల్లో సోవియట్ యూనియన్ ఆఫ్ఘనిస్తాన్‌లోకి సైన్యాన్ని పంపినప్పుడు నాటో కూటమి, అమెరికా దానిని తీవ్రంగా ఖండించాయి. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా భారతదేశం కూడా తమ కూటమి వైపు నిలబడాలని అమెరికా ఆశించింది; కానీ ఇందిరాగాంధీ దానిని తిరస్కరించారు. అమెరికా అధ్యక్షుడి సమక్షంలోనే, "మేము ఏ ఒక్క దేశానికి లేదా కూటమికి వ్యతిరేకం కాదు; అలాగని మరొకరి ఒత్తిడికి తలొగ్గి ఏ కూటమిలోనూ చేరము. భారత్ ఎల్లప్పుడూ స్వతంత్ర విదేశాంగ విధానాన్నే అనుసరిస్తుంది" అని తేల్చి చెప్పారు. అలాగే అటల్ బిహారీ వాజ్‌పేయి పాకిస్తాన్‌కు స్నేహహస్తం అందిస్తూ వాఘా-అటారీ సరిహద్దుల గుండా పాకిస్తాన్‌కు బస్సు ప్రయాణాన్ని పునరుద్ధరించారు. కానీ పాకిస్తాన్ కుట్ర చేసి మన భూభాగంలోకి సైన్యాన్ని పంపి చొరబాట్లను ప్రోత్సహించింది. బస్సుతో స్నేహహస్తాన్ని అందించిన వాజ్‌పేయి, పాకిస్తాన్‌ను కార్గిల్ నుండి తరిమికొట్టే వరకు నిద్రపోలేదు. 1971 లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ నాయకత్వంలో పాకిస్తాన్‌తో చేసిన యుద్ధంలో మన సైన్యం దాదాపు లక్ష మంది పాకిస్తాన్ సైనికులను బందీలుగా పట్టుకొచ్చింది. అప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు ఒకేలా లేవు కాబట్టే పాకిస్తాన్ మనల్ని కవ్వించిన ప్రతిసారీ ఈ రోజుల్లో మనం నిశ్శబ్దంగానే బుద్ధి చెబుతున్నాము. నిజాం సంస్థానం విషయంలో కూడా నెహ్రూ గారు నిజాంకు భయపడి సైనిక చర్య వద్దనుకోలేదు. ఈ రోజు జాతీయ ప్రయోజనాల కోసం మోదీ ట్రంప్ వాచాలతను భరిస్తున్నట్లే, ఆనాడు నెహ్రూ కూడా నిజాంను చర్చల ద్వారా సమన్వయపరచుకునే ప్రయత్నం చేయాలని ఆశించారు. అంతమాత్రాన హైదరాబాద్ సంస్థానంపై సైనిక చర్యను నెహ్రూ వ్యతిరేకించారని ప్రచారం చేయడం చరిత్రకు వక్రభాష్యం చెప్పడమే అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటాన్ని గుర్తించనంత మాత్రాన చరిత్ర మాసిపోదు; అదే సమయంలో కేవలం పటేల్ పేరుతోనే హైదరాబాద్ విమోచనాన్ని చూపించే ప్రయత్నం చేసినంత మాత్రాన దేశ నిర్మాణంలో నెహ్రూ పాత్ర చెరిగిపోదు. కానీ ప్రభుత్వాలు ఇలా సంకుచితంగా వ్యవహరించడం వల్ల భావి తరాలకు చరిత్రలోని స్ఫూర్తిదాయకమైన విషయాలను అందించలేకపోతున్నాం. స్వాతంత్ర్య పోరాటంలో భారతీయ జనతా పార్టీకి మూలమైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలుపంచుకోకపోవడం నేటి బీజేపీ నాయకత్వాన్ని అమితంగా బాధపెడుతోంది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబం స్వాతంత్ర్య పోరాట చరిత్ర కలిగి ఉండటాన్ని వారు జీర్ణించుకోలేకపోవడం బాధాకరం. గాంధీజీ గురించి కూడా భారతీయ జనతా పార్టీకి ఇటువంటి అసంతృప్తి లేకపోలేదు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' పేరుతో పటేల్ విగ్రహాన్ని ప్రతిష్టించారు కానీ, మన జాతిపితకు మాత్రం అటువంటి ఘనమైన ఏర్పాట్లు ఏమీ చేయలేదు. నెహ్రూ గారిని పూర్తిగా ఉపేక్షించినట్లు కాకుండా, ఉన్న ఆశ్రమాలను పునరుద్ధరిస్తూ గాంధీ చిత్రపటాలతో మ్యూజియంలను ఏర్పాటు చేస్తున్నారు. పటేల్, గాంధీ ఇద్దరూ వారి ప్రాంతం (గుజరాత్) వారే. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వయంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు పూర్తి వ్యతిరేకి. కానీ బీజేపీ నాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని పూర్తిగా పక్కన పెట్టింది అనుకోకుండా ఉండటానికి పటేల్‌ను ఎంచుకుంది. 1948 జనవరి 30 న మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేసిన తర్వాత, అప్పటి హోం శాఖా మంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 1948 ఫిబ్రవరి 4న ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారు. ఇది ప్రధాని నెహ్రూ అనుమతి లేకుండా జరగదు. కానీ వల్లభాయ్ పటేల్ ఒక అడుగు ముందుకు వేసి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ సంఘ్ పరివార్ జీర్ణించుకోలేనివే. ఆయన వ్యాఖ్యలు: "ఆర్ఎస్ఎస్ నాటిన ద్వేషపు విత్తనాల ఫలితంగానే మనం గాంధీజీ లాంటి గొప్ప నాయకుడిని కోల్పోయాము. ఆర్ఎస్ఎస్ నాయకుల ప్రసంగాలు మత విద్వేషంతో నిండిపోయాయి. ఆ విషపూరిత వాతావరణమే గాంధీజీ హత్యకు దారితీసింది." ఆ నిషేధాన్ని తొలగించే సమయంలో పటేల్ విధించిన షరతులను, ఆర్ఎస్ఎస్ అంగీకరించిన విషయాలను కూడా మనం గమనించాలి: ఆర్ఎస్ఎస్ ఒక లిఖితపూర్వకమైన రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలి. కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితమవ్వాలి, ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకూడదు. భారతదేశ జాతీయ పతాకమైన త్రివర్ణ పతాకానికి, భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. సంస్థలో ప్రజాస్వామ్యబద్ధంగా అంతర్గత ఎన్నికలు జరగాలి. ఎలాంటి హింసకూ తావుండకూడదు. అయితే ఆర్ఎస్ఎస్ రాజకీయాలకు దూరంగా ఉండలేదు; భారతీయ జనసంఘ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది. దానికి వారు చెప్పే సమాధానం ఏమిటంటే—సంస్థ సభ్యులు తమకిష్టమైన పార్టీలో చేరవచ్చు, రాజకీయం చేసుకోవచ్చు కాబట్టి ఎవరి ఇష్టం వారిది అని. కానీ వారు సమాధానం చెప్పలేని ప్రశ్న ఏమిటంటే: సంఘ్ పరివార్ సభ్యులలో ఎవరికీ కాంగ్రెస్ పార్టీలోనో, కమ్యూనిస్టు పార్టీలోనో చేరాలని ఎందుకు అనిపించలేదు? అంతకంటే ముఖ్యంగా, అందరూ కేవలం నాటి జనసంఘ్, నేటి బీజేపీలోనే ఎందుకు చేరారు? రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చనుకున్నా, 1949 లో అంగీకరించిన షరతు ప్రకారం గౌరవించవలసిన జాతీయ జెండాను 2002 వరకు నాగపూర్‌లోని తమ ప్రధాన కార్యాలయంపై ఎందుకు ఎగురవేయలేదు? అది చరిత్ర; ఆర్ఎస్ఎస్ చరిత్ర. చరిత్రలో వాస్తవాలు మాత్రమే ఉంటాయి, అనుకూల ప్రశ్నలకు మాత్రమే జవాబులు ఉండవు. నాటి ప్రధానమంత్రి నెహ్రూ నేతృత్వంలోనే హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య చేపట్టడానికి ఆదేశాలు ఇచ్చారు అన్న సత్యాన్ని కేంద్రం గుర్తుంచుకోవాలి. భూమి కోసం, భుక్తి కోసం, బడుగు వర్గాల విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నడిచిన తెలంగాణ సాయుధ పోరాటం తెలంగాణ ప్రజల జీవన స్రవంతిలో అంతర్వాహినిగా కొనసాగుతూనే ఉంటుంది. ఆ పోరాట పటిమే తెలంగాణ ప్రజల అసలైన, ఘనమైన వారసత్వ సంపద.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 18

* 2003: ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం
* 1752: ఫ్రెంచి గణిత శాస్త్రవేత్త అడ్రియన్ మేరీ లెజెండ్రీ జననం (మ.1833).
* 1783: స్విట్జర్లాండుకు చెందిన గణిత శాస్త్రజ్ఞుడు, భౌతిక శాస్త్రజ్ఞుడు లియొనార్డ్ ఆయిలర్ మరణం (జ.1707).
* 1950: భారత సినిమా నటి షబానా అజ్మీ జననం.(చిత్రంలో)
* 1951: భారత పార్లమెంటు సభ్యుడు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి జననం.
* 1958: భారతీయ తత్వవేత్త, భారతరత్న పురస్కార గ్రహీత భగవాన్ దాస్ మరణం (జ.1869).
* 1976: బ్రెజిల్ ఫుట్‌బాల్ ఆటగాడు రొనాల్డో జననం.
* 1977: వాయేజర్ 1 ఉపగ్రహం


షబానా అజ్మీ

చంద్రుడు, భూమి చిత్రాలను తీసింది..
* 1978: హేతువాది ఎ.టి.కోవూర్ మరణం (జ.1898).
* 1992: భారత ప్రధాన న్యాయమూర్తి. తాత్కాలిక రాష్ట్రపతిగా ముప్పై ఐదు రోజులపాటు పనిచేసిన మహమ్మద్ హిదయతుల్లా మరణం (జ.1905).

### వారం రోజుల పోలీసు కస్టడీకి
## జోసెఫ్ రావణ్.. కోర్టు కీలక ఆదేశాలు

* చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారనే ఆరోపణలు
* రావణ్ పై యూఏపీఏ కింద కేసు నమోదు
* రేపు కస్టడీకి తీసుకోనున్న గన్నవరం పోలీసులు



సోషల్ మీడియా వేదికగా విద్వేషపూరిత వ్యాఖ్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ రావణ్ కేసులో గన్నవరం న్యాయస్థానం ఈరోజు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసు విచారణలో భాగంగా జోసెఫ్‌ను ఏడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు రేపు (సెప్టెంబరు 18) ఉదయం గన్నవరం పోలీసులు అతడిని కస్టడీకి తీసుకోనున్నారు. యువతను రెచ్చగొట్టేలా వీడియోలు రూపొందించడం, ఏలూరులో నిర్వహించిన ఓ సమావేశంలో నక్సలిజం వైపు మళ్లేలా ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై ఏపీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కుట్ర వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో ఉన్న సంబంధాలు, దీని వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాల కోణంలో లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, వారం రోజుల కస్టడీకి అంగీకరించడంతో రాబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి
## నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

: జగన్ పై అనిత ఫైర్
* డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
* డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
* వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య



ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## మహిళా క్రికెటర్లకు WAPL చక్కటి వేదిక

: రాయపాటి శైలజ

విజయవాడ: క్రికెట్ అనేది ప్రజలకు హార్ట్‌బీట్ వంటిదని.. అలాంటి క్రికెట్‌లో ఇప్పుడు మహిళలకు కూడా ప్రత్యేకమైన గుర్తింపు ఉందని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. గతంలో మహిళల క్రికెట్‌ను నిర్లక్ష్యం చేసినా.. ప్రస్తుతం తమ ఆట, పట్టుదలతో అందరూ గుర్తించేలా భారత మహిళా క్రికెట్ జట్టు మారిందని పేర్కొన్నారు. మహిళా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన 'Bikes & Bats Women on Wheels' బైక్ రైడ్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ACA ద్వారా మహిళలకు WAPL ఒక మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ నెల 19 నుంచి 27 వరకు మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు.

# క్లిష్టమైన కేసులకు అత్యాధునిక చికిత్సలు.. మెరుగైన ఫలితాలు

* ఐవస్ సాంకేతికతతో రెండు క్లిష్టమైన కేసుల్లో విజయవంతంగా చికిత్స
* కామినేనిలో అందుబాటులోకి యాంజియోప్లాస్టీకి ఇంట్రావాస్క్యులర్ అల్ట్రాసౌండ్ (ఐవస్)
* బ్లాకేజ్ తీవ్రత, రక్తనాళాల పరిస్థితిని కచ్చితంగా అంచనా వేసేందుకు అత్యాధునిక సాంకేతికత
* కామినేని హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎన్ పవన్ కుమార్






విజయవాడ: గుండె రక్తనాళాల్లోని బ్లాకేజ్‌ను మరింత కచ్చితంగా అంచనా వేయడంతో పాటు యాంజియోప్లాస్టీ సమయంలో సరైన పరిమాణంలో స్టెంట్‌ను ఎంపిక చేసి, అది రక్తనాళంలో సరిగ్గా అమర్చబడిందో లేదో నిర్ధారించేందుకు ఇంట్రావాస్క్యులర్ అల్ట్రాసౌండ్ (ఐవస్) అత్యంత ఉపయోగకరమైన అత్యాధునిక వైద్య సాంకేతికత అని కామినేని హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎన్ పవన్ కుమార్ తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని హోటల్ ఇంద్రప్రస్థలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాధారణ యాంజియోగ్రామ్ ద్వారా కనిపించే సమాచారంతో పాటు రక్తనాళం లోపలి పరిస్థితిని మరింత స్పష్టంగా తెలుసుకునేందుకు 'ఐవస్' సహాయపడుతుందని వివరించారు. ముఖ్యంగా బ్లాకేజ్ ఎంత మేరకు ఉంది, రక్తనాళం పరిమాణం ఎంత ఉంది, బ్లాకేజ్ తీవ్రత ఎలా ఉంది, రక్తనాళం గోడల్లో కాల్షియం ఎంతమేర పేరుకుపోయింది వంటి అంశాలను అంచనా వేయడంలో 'ఐవస్' ఉపయోగపడుతుందన్నారు. ఈ సమాచారంతో యాంజియోప్లాస్టీ సమయంలో సరైన చికిత్సా విధానాన్ని నిర్ణయించుకోవడంతో పాటు, అవసరమైన స్టెంట్ పరిమాణాన్ని ఎంపిక చేయడానికి కూడా వైద్యులకు సహాయపడుతుందని తెలిపారు. ఇటీవల 85 ఏళ్ల వృద్ధుడు గుండెపోటుతో కామినేని హాస్పిటల్‌కు వచ్చారని, పరీక్షల్లో గుండె రక్తనాళంలో సుమారు 99 శాతం బ్లాకేజ్ ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఆ బ్లాకేజ్ చాలాకాలంగా ఉండటంతో రక్తనాళంలో కాల్షియం చాలా గట్టిగా పేరుకుపోయి, రాయిలా మారిన పరిస్థితి కనిపించిందన్నారు. ఇలాంటి క్లిష్టమైన బ్లాకేజ్‌లో కాల్షియం ఎంత మందంగా ఉంది, రక్తనాళం లోపలి పరిస్థితి ఎలా ఉంది, బ్లాకేజ్ అసలు తీవ్రత ఎంత అనే అంశాలను కచ్చితంగా తెలుసుకోవడం చికిత్సకు కీలకమని చెప్పారు. 'ఐవస్' సహాయంతో రక్తనాళం లోపలి పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి తదనుగుణంగా చికిత్స అందించినట్లు వివరించారు. మరో కేసులో నాలుగేళ్ల క్రితం అమర్చిన స్టెంట్‌లోనే తిరిగి బ్లాకేజ్ ఏర్పడిన రోగికి 'ఐవస్' సహాయంతో చికిత్స అందించినట్లు తెలిపారు. గతంలో వేసిన స్టెంట్ ఎందుకు బ్లాక్ అయింది, స్టెంట్ రక్తనాళంలో సరిగ్గా విస్తరించిందా, స్టెంట్ చుట్టూ తిరిగి బ్లాకేజ్ ఏర్పడటానికి కారణాలు ఏమిటనే అంశాలను ఐవస్ ద్వారా విశ్లేషించగలిగామని చెప్పారు. రక్తనాళం లోపలి పరిస్థితిని ప్రత్యక్షంగా అంచనా వేసిన తర్వాత అవసరమైన చికిత్సను నిర్ణయించినట్లు తెలిపారు. క్లిష్టమైన గుండె బ్లాకేజ్‌లలో కేవలం యాంజియోగ్రామ్ ఆధారంగా కాకుండా, అవసరమైన సందర్భాల్లో ఐవస్ వంటి ఇంట్రావాస్క్యులర్ ఇమేజింగ్ సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా రోగి పరిస్థితిపై మరింత స్పష్టమైన అవగాహన పొందవచ్చని డాక్టర్ పవన్ కుమార్ పేర్కొన్నారు. బ్లాకేజ్ స్వభావం, రక్తనాళం పరిమాణం, కాల్షియం స్థాయి, స్టెంట్ ఎంపిక, స్టెంట్ అమరిక వంటి అంశాలను కచ్చితంగా అంచనా వేసి చికిత్స అందించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. ఈ తరహా క్లిష్టమైన కేసుల్లో రోగి పరిస్థితిని సమగ్రంగా తెలుసుకుని చికిత్స చేయడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. కామినేని హాస్పిటల్స్‌లో IVUS వంటి అత్యాధునిక సాంకేతికతతో పాటు అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు అందుబాటులో ఉన్నారని ఆయన తెలిపారు. అవసరమైన రోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుండె సంబంధిత క్లిష్టమైన సమస్యలకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో కామినేని హాస్పిటల్స్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రేమాల అర్చన, కామినేని క్లస్టర్ హెడ్ పి. సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ కె. ఆర్. రమణారావు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్
# నివాసయోగ్య ప్లాట్ల వేలానికి పచ్చజెండా



అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన నివాసయోగ్య ప్లాట్లు వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈవేలం ప్రక్రియ ద్వారా విక్రయానికి నేషనల్ లాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రచారం కోసం ఈ నెల 23న విశాఖలో, 24న విజయవాడలో, 25న హైదరాబాద్‌లో పెట్టుబడిదారుల సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించింది. విశాఖలోని హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, ఆటో నగర్, గాజువాకలో 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 459 ప్లాట్లు విక్రయించనున్నారు. సుమారుగా ఒక్కో ప్లాట్ విస్తీర్ణం 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంది. ఈ ప్రక్రియ కోసం క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లావాదేవీల సలహాదారుగా నియమించారు. ఈవేలం రైల్‌టెల్ ఇనివిడా ఇప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా రెండు విడతల్లో నిర్వహిస్తారు. 243 ప్లాట్లకు అక్టోబర్ 12 తొలి వేలం జరుగుతుంది. దీనికి రిజిస్ట్రేషన్ ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్ 8 సాయంత్రం 5:00 గంటల వరకు గడువు ఇచ్చారు. 216 ప్లాట్లకు అక్టోబర్ 16న రెండవ విడత వేలం నిర్వహిస్తారు. దీనికి రిజిస్ట్రేషన్ EMD సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్ 14గా నిర్ణయించారు. ఒక్కో ప్లాట్‌కు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) రూ.2లక్షలుగా నిర్ణయించారు.

# రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని.. మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

* గుండెపోటుతో మరణించిన ఆళ్ల నానికి మంత్రి లోకేశ్ నివాళి
* రాజకీయాల్లో నాని హుందాగా వ్యవహరించారని కొనియాడిన లోకేశ్
* వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమస్యలపైనే పోరాడారన్న మంత్రి
* నాని కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ
* లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అంజలి



మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్ళం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. "ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం" అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరపున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరపున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళులర్పించారు.



## రాజధాని అమరావతిలో రెండో విడత
# భూసేకరణ వేగవంతం

అమరావతి: రాజధాని అమరావతిలో రెండో విడత భూసమీకరణ వేగవంతమైంది. పల్నాడు జిల్లా అమరావతి మండలం పెదమద్దూరు గ్రామంలో 75 శాతం భూసమీకరణ పూర్తయినట్లు ఏపీ సీఆర్డీఏ అధికారులు వెల్లడించారు. గ్రామంలో 1,018 ఎకరాల భూమి తీసుకోవాలని నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పటి వరకూ 764.23 ఎకరాలు భూసమీకరణ కింద రైతులు అందజేశారు. భూములిచ్చిన రైతులకు వెంటనే కౌలు చెల్లించేలా సీఆర్డీఏ చర్యలు చేపట్టింది. దీంతో రైతులు భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతిరోజూ రైతులు ల్యాండ్ పూలింగ్ కింద తమ భూములిచ్చేందుకు అంగీకార పత్రాలను సీఆర్డీఏ అధికారులకు అందజేస్తున్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో రాజధాని నిర్మాణానికి భూములు ఇస్తున్న పెదమద్దూరు గ్రామస్థులకు సీఆర్డీఏ అధికారులు ధన్యవాదాలు తెలిపారు. మిగతా రైతులు కూడా భూములు ఇచ్చి ప్రజారాజధాని అమరావతి అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# ముత్యపుపందిరి వాహనంపై కనువిందు చేసిన మలయప్పస్వామి


సకల సౌభాగ్య సిద్ధికి ప్రతీక జ్యోతిషశాస్త్రంలో ముత్యాలు చంద్రునికి ప్రతీకగా పేర్కొన్నారు.

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ముత్యపుపందిరి వాహనంపై బాలకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిచ్చెన ఎక్కి వెన్న దొంగిలించే బాలకృష్ణుడి లీలను తలపించే ఈ అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మాడ వీధుల్లో వైభవంగా సాగిన వాహనసేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాబృందాల ప్రదర్శనలు భక్తులను అలరించాయి. పెద్ద సంఖ్యలో భక్తులు మాడ వీధులకు తరలివచ్చి స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ముత్యపుపందిరి వాహనం.. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్లు పురాణాల్లో ప్రస్తావన ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల పందిరిగా స్వీకరించి శ్రీనివాసుడు భక్తులకు దర్శనమివ్వడం ఈ వాహనసేవ ప్రత్యేకత. చల్లని ముత్యాల పందిరి కింద కొలువైన శ్రీవారిని దర్శించుకోవడం వల్ల తాపత్రయాలు తొలగి, భక్తుల జీవితాల్లో సుఖశాంతులు, సకల శుభాలు చేకూరుతాయని పురాణ ప్రశస్తి. ఈ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, తితిదే ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# రాత పరీక్ష ద్వారానే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ




అమరావతి: రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ద్వారా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ ద్వారా నియామకం కోసం నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న మెరిట్ ప్రాతిపదికన వెయిటేజ్ పద్ధతిని కాకుండా రాత పరీక్ష ద్వారా నియామక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మెరిట్ ఆధారంగా నియామక ప్రక్రియ ఉండాలని ఈనెల 13, 14న జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేస్తూ తాజా జీవోను పశుసంవర్ధక శాఖ గురువారం విడుదల చేసింది.

# ఏపీ మద్యం రవాణా కుంభకోణం.. మాజీ మంత్రి కారుమూరి రిమాండ్ పొడిగింపు

* కారుమూరిని విజయవాడ ప్రత్యేక కోర్టుకు తీసుకొచ్చిన ఈడీ అధికారులు
* హవాలా మార్గంలో రూ. 15 కోట్లు కారుమూరికి చేరినట్లు ఆధారాలు
* ఇప్పటివరకు ఆయన కుటుంబానికి చెందిన రూ. 87.7 కోట్ల ఆస్తుల జప్తు



మద్యం రవాణా స్కామ్ కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు పీటీ వారెంట్‌పై విజయవాడ ప్రత్యేక కోర్టుకు తీసుకువచ్చారు. విచారణ అనంతరం ఆయన రిమాండ్ ను న్యాయస్థానం సెప్టెంబరు 25 వరకు పొడిగించింది. ఈ కేసు విషయానికొస్తే... (ఈడీ నివేదిక ప్రకారం) సాధారణ నిబంధనల మేరకు కిలోమీటర్‌కు రూ. 13 మాత్రమే రవాణా ఛార్జీలుగా చెల్లించాల్సి ఉండగా, టెండర్ల నిబంధనలను అక్రమంగా సవరించి కిలోమీటర్‌కు ఏకంగా రూ. 35 వరకు చెల్లించారు. ఈ అక్రమ మార్పుల కారణంగా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 195.33 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లినట్లు దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా లెక్కగట్టింది. కారుమూరి నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో తన అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ తన కుమారుడు, వ్యాపార భాగస్వాములకు మద్యం రవాణా సబ్‌కాంట్రాక్టులు దక్కేలా చక్రం తిప్పారని దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంలో హవాలా మార్గంలో దాదాపు రూ. 15 కోట్లు కారుమూరికి చేరినట్లు ఆధారాలు సేకరించిన అధికారులు, ఇప్పటివరకు ఆయన కుటుంబానికి చెందిన రూ. 87.7 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేశారు. ఈ కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు సునీల్ కుమార్, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, డిజిటల్ నెట్‌వర్క్స్ అధినేత కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిలను ఈడీ అరెస్ట్ చేసి విచారిస్తోంది.

# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

: **అమరుల త్యాగాలను స్మరించుకున్న రాష్ట్రం**

హైదరాబాద్: తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన సెప్టెంబర్ 17వ తేదీని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం' (విమోచన/విలీన దినోత్సవం) వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రధాన వేడుకల్లో ముఖ్యమంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిరంకుశ నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేశారు. వెట్టిచాకిరీ, భూస్వామ్య దోపిడీపై పిడికిలెత్తి పోరాడిన వీర నారీమణులు చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి యోధుల త్యాగాలను కొనియాడారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని స్పష్టం చేశారు.

**వేడుకల్లోని ప్రధాన విశేషాలు**

అమరులకు నివాళులు: గన్ పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నేతలు ఘనంగా నివాళులర్పించారు.

**సాయుధ బలగాల కవాతు**

పోలీసు, పారామిలిటరీ బలగాలు నిర్వహించిన ఆకట్టుకునే మార్చ్‌ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంస్కృతిక ప్రదర్శనలు: తెలంగాణ సంస్కృతి, సాయుధ పోరాట వైభవాన్ని ప్రతిబింబించేలా కళాకారులు ప్రదర్శించిన ఒగ్గుకథ, ధూంధాం, గిరిజన నృత్యాలు ఆహూతులను అలరించాయి.

**జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలు**

అన్ని జిల్లాల కలెక్టరేట్లలో సంబంధిత మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి వేడుకల్లో పాల్గొన్నారు. సరిగ్గా ఇదే రోజు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 'తెలంగాణ విమోచన దినోత్సవం' పేరిట ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పలు రాజకీయ పార్టీలు తమ కార్యాలయాల్లో జెండాలను ఆవిష్కరించి సెప్టెంబర్ 17 ప్రాధాన్యతను చాటాయి. రాష్ట్రమంతటా పండుగ వాతావరణంలో ఈ సంబరాలు ముగిశాయి.











## పెద్దలు అంగీకరించలేదని..
## బావిలో దూకి ప్రేమ జంట ఆత్మహత్య

దేవరాపల్లి: పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనకాపల్లి జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పెందుర్తికి చెందిన ఇద్దరు మైనర్లు (17) ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఇద్దరూ మైనర్లు కావడంతో వివాహానికి పెద్దలు నిరాకరించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై ఎస్ఐ ఆర్. ధనుంజయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం..
## ఇద్దరు విశాఖ వాసులు మృతి

విశాఖపట్నం: ఆస్ట్రేలియా లోని మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి చెందారు. విశాఖకు చెందిన జీటీ ప్రసాద్ తన భార్యతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ భార్య, కోడలు మృతి చెందగా.. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తన కళ్లెదుటే కారు ప్రమాదంలో భార్య, కోడలు నేహా మృతి చెందటంతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. జీటీ ప్రసాద్ గతంలో వీడీసీఏలో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. దాదాపు పది



రోజుల తర్వాత మృతదేహాలు విశాఖకు చేరుకునే అవకాశముందని సమాచారం.

## యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

నిజామాబాద్: యూట్యూబర్ వైష్ణవి హత్యకేసులో నిందితుడు, ఆమె భర్త చిత్తరి హరిబాబు(26) నిజామాబాద్ నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా హరిబాబు తన తల్లితో కలిసి నిజామాబాద్ ఐదో టౌన్ పరిధిలోని ఇంద్రాపూర్లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో.. దాహం వేసి నీళ్ల కోసం పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా దాడి చేశారు.

## కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ జరపాలి: మహేశ్ గౌడ్

- **కేసీఆర్ కుటుంబానికి చెందిన భూములపై విచారణ జరపాలని మహేశ్ గౌడ్ డిమాండ్**
- **2009లో భూమిలేని కేసీఆర్‌కు ఇప్పుడు వందల ఎకరాలు ఎలా వచ్చాయని ప్రశ్న**
- **అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులకు, వాస్తవానికి పొంతన లేదని ఆరోపణ**
- **బీఆర్ఎస్ నేతల భాష, ప్రవర్తనపై తీవ్ర విమర్శలు**



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ ఆస్తులపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబానికి అంతటి భారీ స్థాయిలో భూములు ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన భూముల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే బహిర్గతం చేశారని మహేశ్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం, 2009లో కేసీఆర్‌కు ఎలాంటి భూమి లేదని, 2014 నాటికి 35 ఎకరాలు ఉండగా, 2018 నాటికి ఆ విస్తీర్ణం మరింత పెరిగిందని తెలిపారు. 2023 నాటికి కేసీఆర్ పేరిట 53 ఎకరాలు ఉండగా, కేటీఆర్ మరో 67 ఎకరాలు కొనుగోలు చేశారని వివరించారు. మొత్తంగా 2023 నాటికే ఆ కుటుంబం పేరిట 123 ఎకరాలు భూమి ఉందని పేర్కొన్నారు. అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులకు, వాస్తవాలకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. భూములకు సంబంధించిన "22ఏ" వివాదంపై కూడా ప్రస్తుతం విచారణ జరుగుతోందని వెల్లడించారు. ఇదే క్రమంలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి వారు వాడిన అనుచిత భాషను, పోలీసుల పట్ల వారి ప్రవర్తనను తీవ్రంగా తప్పుపట్టారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను ఆయన ఖండించారు. వీడియోలను పరిశీలిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉద్దేశపూర్వకంగా దూకుడుగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోందన్నారు.

## తెలంగాణ పోలీస్ నియామక పరీక్షల తేదీలు ఇవే!

- **తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షల తేదీలు విడుదల**
- **నవంబర్ 29న ఎస్ఐ, డిసెంబర్ 20న కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష**
- **మొత్తం 7,437 పోస్టులకు 5.77 లక్షలకు పైగా దరఖాస్తులు**
- **ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌కు సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగింపు**
- **పాత ప్రశ్నపత్రాలు, సిలబస్‌పై దృష్టి పెట్టాలని అభ్యర్థులకు సూచన**

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు కీలకమైన ప్రకటన వెలువడింది. ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రాథమిక రాత పరీక్ష (ప్రిలిమినరీ) తేదీలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (TSLPRB) ఖరారు చేసింది. ఈ వివరాలను టీఎస్ఎల్‌పీఆర్బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం, ఎస్ఐ (SI) పోస్టులకు 2026 నవంబర్ 2న, కానిస్టేబుల్ పోస్టులకు 2026 డిసెంబర్ 20న ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF), అగ్నిమాపక, జైళ్ల శాఖల పరిధిలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

**పోస్టులకు భారీ స్పందన**

ఈ ఉద్యోగాలకు రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు కేవలం 28 రోజుల వ్యవధిలో మొత్తం 5,77,064 దరఖాస్తులు అందినట్లు బోర్డు వెల్లడించింది. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సగటున ఒక్కో అభ్యర్థి 1.34 పోస్టులకు దరఖాస్తు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దరఖాస్తుదారుల్లో 74.66 శాతం పురుషులు, 25.33 శాతం మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీ అభ్యర్థులు 49.19 శాతం, ఎస్సీ/ఎస్టీలు 43.60 శాతం, ఓసీలు 7.20 శాతం చొప్పున ఉన్నారు.

* **పరీక్షల నిర్వహణ, ఇతర వివరాలు**

పరీక్షల నిర్వహణకు బోర్డు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షను పాత 10 జిల్లాల కేంద్రాల్లో, కానిస్టేబుల్ పరీక్షను 15 నుంచి 18 ప్రాంతాల్లో నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దరఖాస్తు సమయంలో ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను 97.4 శాతం మంది పూర్తి చేశారని, సాంకేతిక కారణాల వల్ల పూర్తి చేయలేకపోయిన మిగిలిన వారికి సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించినట్లు ఛైర్మన్ తెలిపారు. అభ్యర్థులు గత ప్రశ్నపత్రాలు, సిలబస్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించి పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సూచించారు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్‌ను తనిఖీ చేయాలని బోర్డు కోరింది.

# భారత ప్రయాణికులకు అలర్ట్.. 9 దేశాల్లో మారిన వీసా నిబంధనలు!

- **భారత ప్రయాణికుల కోసం తమ వీసా నిబంధనలను మార్చిన 9 దేశాలు**
- **అనేక దేశాల్లో వీసా ఆన్ అరైవల్ సౌకర్యం రద్దు, ఇ-వీసా తప్పనిసరి**
- **శ్రీలంక, ఖతార్, లావోస్ వంటి దేశాల్లో ప్రయాణానికి ముందే అనుమతి అవసరం**
- **ఇ-వీసా విధానాన్ని ప్రవేశపెట్టి నిబంధనలను సులభతరం చేసిన కొన్ని దేశాలు**
- **ప్రయాణాలకు ముందు కొత్త రూల్స్ తెలుసుకోవాలని నిపుణుల సూచన**




విదేశీ ప్రయాణాలు చేసే భారత పాస్‌పోర్ట్ హోల్డర్లకు ఇది ముఖ్యమైన సమాచారం. 2026 సంవత్సరంలో సుమారు 9 దేశాలు తమ వీసా నిబంధనలను సవరించాయి. గతంలో సులభంగా లభించే వీసా ఆన్ అరైవల్ (ఆ దేశానికి వెళ్లాక వీసా పొందే సౌకర్యం) స్థానంలో ఇప్పుడు అనేక దేశాలు ప్రయాణానికి ముందే ఆన్‌లైన్‌లో అనుమతి పొందడాన్ని (ఇవీసా లేదా ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్) తప్పనిసరి చేశాయి. ఈ మార్పుల నేపథ్యంలో భారత ప్రయాణికులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. పాస్‌పోర్ట్ ఇండెక్స్ తాజా డేటా ప్రకారం.. ప్రస్తుతం భారత పాస్‌పోర్ట్ ప్రపంచవ్యాప్తంగా 73వ స్థానంలో ఉంది. 2025 నాటి డేటాతో పోలిస్తే, కొన్ని దేశాల్లో భారతీయులకు వీసా ఆన్ అరైవల్ సౌకర్యం దూరమైంది. ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత దేశం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇది ప్రయాణ ప్రణాళికలపై నేరుగా ప్రభావం చూపుతుంది.

**ఏయే దేశాల్లో నిబంధనలు మారాయి?**

ప్రధానంగా పలు దేశాలు తమ వీసా విధానాల్లో మార్పులు చేశాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి: లావోస్, ఖతార్: ఈ రెండు దేశాల్లోనూ ఇప్పటివరకు ఉన్న వీసా ఆన్ అరైవల్ విధానాన్ని రద్దు చేశారు. ఇకపై భారత ప్రయాణికులు ఈ దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా ఇవీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. శ్రీలంక: ఇరుగుపొరుగు దేశమైన శ్రీలంక కూడా తన నిబంధనలను మార్చింది. గతంలో ఉన్న ఇవీసా ఆన్ అరైవల్ స్థానంలో, ఇప్పుడు ప్రయాణానికి ముందే ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ (ఈటీఏ) పొందడం తప్పనిసరి చేసింది. ఇరాన్: 2025 నవంబర్ నుంచే ఇరాన్ వీసా ఆన్ అరైవల్ సౌకర్యాన్ని నిలిపివేసింది. ప్రస్తుతం ఆ దేశంలో పర్యటించాలంటే ఇవీసా తప్పనిసరి. కేప్ వెర్డే: ఈ దేశం 2026 జనవరి 1 నుంచి భారత్‌తో సహా 96 దేశాల పౌరులకు వీసా ఆన్ అరైవల్ సదుపాయాన్ని రద్దు చేసింది. నికరాగ్వా: 2026 ఫిబ్రవరి 14 నుంచి భారత పాస్‌పోర్ట్ హోల్డర్లు ఈ దేశానికి వెళ్లాలంటే ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి లేదా ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఈమెయిల్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని పంపాలి.

*** కొన్ని దేశాల్లో సులభతరమైన నిబంధనలు**

అయితే, కొన్ని దేశాలు భారతీయులకు వీసా ప్రక్రియను సులభతరం చేయడం గమనార్హం. గతంలో సాంప్రదాయ వీసా విధానాన్ని అనుసరించిన చిలీ, ఘనా, వెనిజులా దేశాలు ఇప్పుడు ఇవీసా ఆప్షన్లను అందిస్తున్నాయి. ఇది ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చే అంశం.

*** ప్రయాణికులకు నిపుణుల సూచన**

వీసా నిబంధనలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి కాబట్టి, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ట్రావెల్ నిపుణులు సూచిస్తున్నారు. విమాన టిక్కెట్లు బుక్ చేసుకునే ముందు లేదా ప్రయాణ ప్రణాళికలు ఖరారు చేసుకునే ముందు సంబంధిత దేశాల అధికారిక రాయబార కార్యాలయాల వెబ్‌సైట్లను సందర్శించి, తాజా వీసా నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. ముందస్తు సమాచారం లేకుండా ప్రయాణానికి సిద్ధమైతే, విమానాశ్రయాల్లో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

## అది వీడియో గేమ్ ఫుటేజ్
# పాక్ 'ఫేక్' వార్‌కు భారత్ కౌంటర్

తన అబద్ధపు మాటలు.. అసత్య ప్రచారాలతో అంతర్జాతీయ వేదికలపై ఎన్నిసార్లు భంగపడినా పాకిస్థాన్ బుద్ధి మాత్రం మారట్లేదు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్‌పై పెద్ద ఎత్తున 'ఫేక్' వార్ చేసి నవ్వులపాలైన దాయాది.. ఇప్పుడు మరోసారి మన వాయుసేనపై బురదజల్లే ప్రయత్నం చేసింది. భారత 'మిగ్ 29' కూలిపోయిందంటూ నకిలీ వార్తను ప్రచారం చేస్తోంది. కానీ, మన ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం.. ఆ అసత్య కథనాలను ఆధారాలతో సహా నిరూపించి పాక్ గాలి తీసేసింది. అసలేం జరిగిందంటే.. భారత



వాయుసేనకు చెందిన మిగ్29 యుద్ధ విమానం ల్యాండ్ అవుతుండగా కూలిపోయిందని కొన్ని గంటల నుంచి సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగనప్పటికీ.. పైలట్ తప్పిదమే ప్రమాదానికి కారణమనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే పీఐబీ దీనిపై ఫ్యాక్ట్‌చెక్ చేసి వాస్తవాలను వెల్లడించింది. "పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాలు ఈ వీడియోను వ్యాప్తి చేస్తున్నాయి. ఇది పూర్తిగా నకిలీ వార్త. 'వార్ థండర్' అనే వీడియో గేమ్ ఫుటేజీని తీసుకుని మిగ్ కూలిపోయినట్లు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి అసత్య కథనాల పట్ల అప్రమత్తంగా ఉండండి. కేవలం అధికారిక ఛానళ్ల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించండి" అని పీఐబీ తన ఫ్యాక్ట్‌చెక్ ఖాతాలో పేర్కొంది. దీంతో పాక్ దుర్బుద్ధి మరోసారి బయటపడినట్లయ్యింది.

# మోదీ జన్మదినం.. రక్తదానం చేసిన ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

- **తన 14 అవయవాలను దానం చేస్తానని రేఖా గుప్తా ప్రతిజ్ఞ**
- **అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక పోర్టల్ ప్రారంభం**
- **గిగ్ వర్కర్ల కోసం 'నమో శ్రామిక్ సేవా కేంద్రం' ఏర్పాటు**
- **'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాల నిర్వహణ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా వినూత్న సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారు. ఆమె స్వయంగా రక్తదానం చేయడంతో పాటు, తన అవయవాలను దానం చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. అంతేకాకుండా, గిగ్ వర్కర్ల కోసం ఒక ప్రత్యేక సేవా కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వివరాల్లోకి వెళితే, త్యాగరాజ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో సీఎం రేఖా గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రక్తదానం చేశారు. అనంతరం, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులతో సహా తన 14 అవయవాలను దానం చేయడానికి అంగీకరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచి, దానిని ప్రోత్సహించేందుకు స్టేట్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (SOTTO), నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (NOTTO) సంయుక్తంగా రూపొందించిన అవయవదాన పోర్టల్‌ను ఆమె



ప్రారంభించారు. ఈ కార్యక్రమంపై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో రేఖా గుప్తా స్పందిస్తూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి పుట్టినరోజున 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రక్తదానం చేశాను. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ, అంకితభావం, దేశ నిర్మాణం స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టాం. రక్తదానం ప్రాణాలను కాపాడటమే కాదు, మానవత్వం పట్ల మన కర్తవ్యాన్ని చాటిచెబుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, కేబినెట్ సహచరులు ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సా, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఇదే స్ఫూర్తితో, తన నియోజకవర్గమైన షాలిమార్ బాగ్‌లో గిగ్ వర్కర్ల కోసం ఏర్పాటు చేసిన 'నమో శ్రామిక్ సేవా కేంద్రాన్ని' కూడా సీఎం ప్రారంభించారు. ఈ కేంద్రం కార్మికులకు విశ్రాంతి స్థలంగానే కాకుండా, రిజిస్ట్రేషన్, రెన్యూవల్, పథకాల సమాచారం, క్లెయిమ్‌లకు సహాయం వంటి సేవలను ఒకేచోట అందిస్తుంది. "దేశంలోని కార్మికుల గౌరవం, భద్రత, సంక్షేమానికి ప్రధాని మోదీ ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఆయన స్ఫూర్తితోనే ఈ కేంద్రం ఏర్పాటు చేశాం" అని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఫోన్ ఈఎంఐ చెల్లించలేదని..
# యువకుడిని బందీగా చేసి, రక్తాన్ని విక్రయించి!

ఫోన్ ఈఎంఐ చెల్లించలేదని ఓ యువకుడిని అపహరించిన ఇద్దరు వ్యక్తులు.. నాలుగు రోజులపాటు హింసించారు. అంతటితో ఆగకుండా బలవంతంగా బ్లడ్‌బ్యాంక్‌కు తీసుకెళ్లి అతడి రక్తాన్ని అమ్ముకున్నారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో వెలుగుచూసింది. నిందితులను అనికేత్ సింగ్ అలియాస్ కాకా (26), సుశాంత్ శర్మ (31)గా పోలీసులు గుర్తించారు. బాధితుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. నవల్‌కుమార్ అనే యువకుడు ఈఎంఐలో ఫోన్ కొనుగోలు చేశాడు. అయితే, వాయిదా కట్టలేదంటూ నిందితులు అతడిని కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలోనే నిందితులు తన కుమారుడిని నాలుగు రోజుల పాటు బందీగా ఉంచి, బలవంతంగా పనులు చేయించారని, దాడి కూడా చేశారని నవల్‌కుమార్ తల్లి తెలిపారు. అలాగే, అతడి నుంచి రక్తాన్ని సేకరించి విక్రయించారని



ఆరోపించారు. ఈఎంఐ కట్టనందుకు గుణపాఠం చెప్పాలనే ప్లాన్‌లో భాగంగానే నవల్‌ను తమతో తీసుకెళ్లామని సుశాంత్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడిని నాలుగు రోజుల పాటు శుభమ్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో ఉంచి, పనులు చేయించారని.. అలాగే వాయిదా డబ్బు కూడా వసూలు చేశారని పేర్కొన్నారు. శుభమ్ సింగ్‌నూ అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

# యూపీఐ ట్యాక్స్.. ప్రతిపాదన ఏదీ చర్చించలేదు: కాంగ్రెస్ ఎంపీలు

యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఛార్జీలు విధించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం (ఆర్థిక వ్యవహారాలు) సూచించినప్పుడు సభ్యులుగా ఉన్న ఐదుగురు కాంగ్రెస్ ఎంపీలు ఎలాంటి అసమ్మతి వ్యక్తం చేయలేదని వార్తలు వస్తున్నాయి. అయితే, ఆ కథనాల్లో ఎంతమాత్రం నిజం లేదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ వెల్లడించారు. స్థాయీసంఘం సభ్యులు సమావేశమైనప్పుడు.. 'యూపీఐ ట్యాక్స్' ప్రతిపాదనలపై నిర్దిష్ట చర్చ ఏదీ జరగలేదని స్పష్టం చేశారు. "మోదీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన యూపీఐ ట్యాక్స్ (యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలను కాంగ్రెస్ పార్టీ పన్నుగా పేర్కొంటోంది) ప్రతిపాదనపై పార్లమెంట్ ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం చర్చించలేదు. ఆ సమావేశంలోనూ ఈ ఛార్జీల గురించి ఆర్థిక



శాఖ వద్ద ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదన లేదు. ఎండీఆర్ అవసరమా అని ప్రశ్నించినప్పుడు.. ప్రభుత్వ ప్రతినిధుల నుంచి తగిన సమాధానాలు రాలేదు. ఈ యూపీఐ ట్యాక్స్ విధానాలు.. చిన్నస్థాయి భారత వ్యాపారులకు, విక్రేతలకు నష్టం కలిగిస్తాయి. అమెరికన్ కంపెనీలకు లాభాన్ని చేకూర్చుతాయి. యూపీఐ ట్యాక్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోండి.. అగ్రరాజ్యం ముందు లొంగిపోవద్దు" అని గౌరవ్ గొగొయ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ వసూలు చేసే అంశాన్ని చర్చించేందుకు స్థాయీసంఘం సమావేశమైంది. ఈ కమిటీలో కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగొయ్, పి. చిదంబరం, మనీశ్ తివారీ, కిశోరీ లాల్, కె.గోపీనాథ్ సభ్యులుగా ఉన్నారు. ఆగస్టు 12న జరిగిన భేటీలో హాజరైన కాంగ్రెస్ ఎంపీలు.. దీనిపై ఎలాంటి అసమ్మతి వ్యక్తంచేయలేదని పలు కథనాలు పేర్కొన్నాయి. యూపీఐ లావాదేవీలపై ఛార్జీల వడ్డనకు మోదీ ప్రభుత్వం చడీచప్పుడూ లేకుండా రంగం సిద్ధం చేసిందని కాంగ్రెస్ ఆరోపించిన వేళ.. ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలోనే ఎంపీ గొగొయ్ దీనిపై స్పష్టతనిచ్చారు.

## కెనడాతో కలిస్తే భారీ సుంకాలు..
# యూరప్‌కు ట్రంప్ వార్నింగ్

- **కెనడా-యూరప్ ఒప్పందంపై డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం**
- **తమ ప్రయోజనాలకు విఘాతం కలిగితే భారీ సుంకాలంటూ యూరప్‌కు హెచ్చరిక**
- **కెనడా ఒక భయంకరమైన వాణిజ్య భాగస్వామి అని ట్రంప్ విమర్శ**
- **ఇరాన్‌తో యుద్ధం ముగింపు దశకు వచ్చిందని ఆశాభావం వ్యక్తం చేసిన ట్రంప్**
- **ఒప్పందం కోసం ఇరాన్ చాలా ఆసక్తిగా ఉందని కీలక వ్యాఖ్యలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవైపు మిత్రదేశాల కూటమి అయిన యూరప్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూనే, మరోవైపు శత్రువైన ఇరాన్‌తో యుద్ధం ముగింపు దశకు చేరుకుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కెనడా, యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్యపరమైన ఒప్పందం ఏదైనా అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంటే, యూరప్‌పై భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించడానికి లేదా వాణిజ్యాన్ని నిలిపివేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. నార్త్ కరోలినాలోని షార్లెట్ విమానాశ్రయంలో నిన్న విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "యూరోపియన్ యూనియన్‌లో కెనడా అసోసియేట్ సభ్యదేశంగా చేరే అవకాశం ఉందా?" అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఘాటుగా స్పందించారు. "కెనడా ఒక భయంకరమైన వాణిజ్య భాగస్వామి. ఆ ఒప్పందం జరుగుతుందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ అలా జరిగితే, అది మాకు వ్యతిరేకంగా తీసుకున్న శత్రు చర్యగా భావిస్తే, యూరప్‌పై చాలా తీవ్రమైన టారిఫ్‌లు విధిస్తాను లేదా అనేక వస్తువులపై వారితో వాణిజ్యాన్నే ఆపేస్తాను" అని ట్రంప్ హెచ్చరించారు. అయితే, ఈ ఒప్పందం వెనుక యూరప్ ఉద్దేశం మంచిదా? చెడ్డదా? అనే దానిపై తన చర్య ఆధారపడి ఉంటుందని ఆయన షరతు విధించారు. "ఒకవేళ యూరప్ చెడు ఉద్దేశంతో అలా చేస్తే, మేం భారీ సుంకాలు విధిస్తాం. అదే మంచి ఉద్దేశంతో అయితే ఫర్వాలేదు" అని అన్నారు. అయితే మంచి, చెడు ఉద్దేశాలను ఎలా నిర్ణయిస్తారనే దానిపై ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ప్రస్తుతం కొత్తగా ఎలాంటి టారిఫ్‌లను ప్రకటించనప్పటికీ, భవిష్యత్తులో తన వైఖరి ఎలా ఉంటుందో ఆయన ముందుగానే సంకేతాలిచ్చారు.

# దిశా శాలియన్ మృతి కేసు.. ఆదిత్య ఠాక్రేకు రూ.500కోట్ల లీగల్ నోటీసు

దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా శాలియన్ మృతి కేసులో మహారాష్ట్ర మాజీ మంత్రి, శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రేకు రూ.500కోట్ల లీగల్ నోటీసు జారీ అయింది. ఆయనతో పాటు ఎన్‌సీపీ (ఎస్పీ), మహారాష్ట్ర మాజీ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్‌కు కూడా ఈ నోటీసులు అందాయి. దిశ మృతి కేసులో న్యాయం కోసం చేస్తోన్న పోరాటాన్ని రాజకీయ ప్రేరేపితమైనదిగా చిత్రీకరించేందుకు వారు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీశ్ ఈ నష్టపరిహారం కోరారు. 2020 జూన్ 8న ముంబయిలోని ఓ భవనంపై నుంచి పడి దిశా శాలియన్ మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె చనిపోయిన రోజుల వ్యవధిలోనే నటుడు సుశాంత్ తన ఫ్లాట్‌లో శవమై కనిపించారు. ఈ రెండు ఘటనలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఆ సమయంలో అధికారంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం.. దిశ మృతి కేసును కప్పిపుచ్చేందుకు యత్నించిందనే ఆరోపణలు వచ్చాయి. హత్య, అత్యాచారంతో పాటు సుశాంత్ మృతితోనూ ముడిపెడుతూ ప్రచారం సాగింది. కానీ, తన కుమార్తె మృతిపై నాడు సతీశ్ ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదు. అయితే, తన కుమార్తె మృతి చెందిన రోజున ఇంట్లో ఆమె పార్టీ ఏర్పాటుచేసిందని.. దానికి ఆదిత్య ఠాక్రేతో పాటు ఆయన బాడీగార్డులు, నటులు సూరజ్ పంచోలి, డినో మోరియా, మరికొందరు హాజరయ్యారని ఇటీవల కోర్టులో వేసిన పిటిషన్‌లో సతీశ్ పేర్కొన్నారు. దిశపై సామూహిక అత్యాచారం జరిగిందని చెప్పేందుకు తమవద్ద సాక్ష్యాలున్నాయని కేసు వాదిస్తోన్న లాయర్ వ్యాఖ్యలు చేయడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ పరిణామాలతో ఆరేళ్ల తర్వాత ఈ కేసు దర్యాప్తు సీబీఐ చేతుల్లోకి వెళ్లింది. ఈ క్రమంలోనే ఆదిత్య ఠాక్రే స్పందించారు. రాజకీయ కుట్ర కోణంలో భాగంగానే ఈ కేసును మళ్లీ తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. దిశా శాలియన్‌ను తాను ఎప్పుడూ కలవలేదని, ఆమె ఎవరో కూడా తెలియదని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా దిశ మృతి కేసుతో తనను వేధిస్తున్నారని ఆరోపించారు. ఆదిత్య ఠాక్రే



వ్యాఖ్యలు అనిల్ దేశ్‌ముఖ్ సమర్థించారు. దీంతో సతీశ్ వీరికి లీగల్ నోటీసులు పంపించారు. ఈ కేసుకు రాజకీయాలను ముడిపెట్టి.. తన కుమార్తె మృతి కోసం తాను చేస్తోన్న న్యాయ పోరాటాన్ని వారు అవమానించారని ఆయన పేర్కొన్నారు. ఆదిత్య ఠాక్రే, అనిల్ దేశ్‌ముఖ్ క్షమాపణలు చెప్పాలని సతీశ్ డిమాండ్ చేశారు. ప్రధాన మీడియాలో వాటిని ప్రచురించి, ప్రసారం చేయాలని కోరారు. ఆ క్షమాపణలను వారు తమ అధికారిక సోషల్ మీడియాలో పోస్టు చేయాలని ఆ లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు.

## 'మీ మనస్తత్వం మార్చుకోండి.. హిందీని వద్దంటే కుదరదు': విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు

జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. "తమిళనాడు గడ్డపై హిందీ బోధించబోమని చెప్పడం కుదరదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల స్థాపనకు అవసరమైన స్థలాలను గుర్తించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని సూచించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ, "మీరు మీ మనస్తత్వాన్ని మార్చుకోవాలి. నవోదయ విద్యాలయాలు కేంద్రం ఇస్తోంది.. వీటి వల్ల తమిళనాడు ప్రమాణాలేమీ తగ్గిపోవు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మెలగాలి. ఢిల్లీ ప్రజలు చెన్నై వారిని, అలాగే చెన్నై ప్రజలు ఢిల్లీ వారిని దూరం చేసుకోకూడదు" అని హితవు పలికింది.




# ప్రయాణికులకు ఇండిగో షాక్.. పలు సేవలపై ఛార్జీల పెంపు

ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ప్రయాణికులకు షాకిచ్చింది. తల్లిదండ్రులతో కలిసి ప్రయాణించే చిన్నారులతో పాటు, అదనపు బ్యాగేజీ సహా పలు సేవలకు సంబంధించిన ఛార్జీలను పెంచేసింది. టికెట్ ధరతో పాటు అదనంగా ఈ రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటికే పెరిగిన విమాన ఛార్జీలతో సతమతమవుతున్న ప్రయాణికులపై మరింత భారం పడనుంది. పెరిగిన ఛార్జీలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. రెండేళ్లలోపు చిన్నారులకు గతంలో రూ.2000గా ఉన్న ప్రయాణ ఛార్జీని రూ.3 వేలకు పెంచుతున్నట్లు ఇండిగో ప్రకటించింది. తల్లిదండ్రులతో పాటు ప్రయాణించే శిశువులకు



వేరుగా సీటు కేటాయించనప్పటికీ వీరికి టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఒక్క కేటగిరీ ద్వారానే ఏటా రూ.90 కోట్లు అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా. ఏటా సగటున 10 లక్షల మంది చిన్నారులు ఇండిగో విమానాల్లో ప్రయాణిస్తుంటారు. దీంతోపాటు ప్రయాణికులు అదనంగా తీసుకెళ్లే లగేజీకి చెల్లించాల్సిన ఛార్జీలనూ ఇండిగో సవరించింది. కిలోకు రూ.100 పెంచేసింది. ప్రస్తుతం ఒక్కో కేజీ అదనపు లగేజీకి రూ.700 చెల్లిస్తుండగా.. ఇకపై రూ.800 చొప్పున చెల్లించాలి. పెద్దల తోడు లేకుండా ఒంటరిగా ప్రయాణించే పిల్లల(మైనర్ల)కు అందించే సేవలకు గానూ వసూలు చేసే రుసుమును రూ.5వేల నుంచి రూ.5,999కి ఇండిగో పెంచింది. దీంతోపాటు విమానాశ్రయంలో ప్రయారిటీ చెక్‌ఇన్, బోర్డింగ్ ఫీజును రూ.450 నుంచి రూ.650కి సవరించింది. ట్రావెల్ సర్టిఫికెట్ ఫీజునూ రూ.200 నుంచి రూ.300కి పెంచింది.

## NSE ఐపీఓ తొలిరోజు
# 43 శాతం సబ్‌స్క్రిప్షన్




నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపీఓకు మోస్తరు స్పందన లభించింది. సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చిన తొలి రోజైన గురువారం 43 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. బీఎస్ఈ నివేదిక ప్రకారం.. 8,86,42,912 (8.86 కోట్లు) షేర్లకు గానూ 3,83,37,528 (3.83 కోట్లు) షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల (NII) నుంచి అధిక డిమాండ్ వచ్చింది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 72 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రిటెయిల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 44 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా కేవలం 19 శాతం సబ్‌స్క్రిప్షన్ మాత్రమే అందుకుంది. ఉద్యోగులకు కేటాయించిన షేర్లు మాత్రం 97 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యాయి. ఎన్ఎస్ఈ ఐపీఓ నేటి నుంచి సెప్టెంబర్ 21 వరకు అందుబాటులో ఉంటుంది. ధరల శ్రేణి రూ.1700 1785గా కంపెనీ నిర్ణయించింది. ఎన్ఎస్ఈ షేర్లు సెప్టెంబర్ 24న బీఎస్ఈలో లిస్ట్ కానున్నాయి. మరోవైపు ఎన్ఎస్ఈ గ్రే మార్కెట్ ప్రీమియం అంతకంతకూ తగ్గుతోంది. సెప్టెంబర్ 16కు రూ.160గా ఉన్న ప్రీమియం నేడు రూ.148 సూచిస్తోంది. కేవలం 8.29 శాతం లిస్టింగ్ లాభాలు ఉండొచ్చని గ్రే మార్కెట్ ప్రీమియం చెబుతోంది.

# ఇంటి రుణం 'ఈఎంఐ చూసుకోండి'

**సొంతిల్లు ప్రతి కుటుంబానికీ ఒక పెద్ద ఆర్థిక నిర్ణయం. ఇల్లు కొనాలనే ఆలోచనలో తమ ఆదాయ సామర్థ్యాన్ని మించి రుణం తీసుకుంటే ఆ తర్వాత ఈఎంఐల భారం ఇబ్బంది పెట్టొచ్చు. నెలవారీ ఖర్చులకు డబ్బు సరిపోకపోవడమే కాకుండా, పిల్లల చదువులు, పదవీ విరమణ కోసం చేసే మదుపులపైనా ప్రభావం పడొచ్చు.**




దేశంలోని ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు, గృహ రుణాల భారం పెరుగుతున్నాయి. మ్యాజిక్‌బ్రిక్స్ గణాంకాల ప్రకారం నగరాల్లో సగటు కుటుంబాలు తమ చేతికి వచ్చే ఆదాయంలో 61 శాతం వరకూ ఇంటి రుణాల ఈఎంఐలకు కేటాయిస్తున్నాయి. 2020లో ఈ వాటా 46 శాతంగా ఉండేది. ఇల్లు కొనేటప్పుడు చాలామంది రుణం, ఈఎంఐ లెక్కలకే పరిమితమవుతున్నారు. కానీ, ఇంటి కొనుగోలుతో ఇతర ఖర్చులూ ఉంటాయి. స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, ఇంటీరియర్, ఫర్నీచర్, ఆస్తి పన్ను, గృహ బీమా, మరమ్మతుల ఖర్చులనూ పరిగణనలోకి తీసుకోవాలి. ఇవన్నీ కలిపితే ఇంటి కోసం చేసే నెలవారీ వ్యయం మరింత పెరుగుతుంది. సాధారణంగా ఇంటి రుణం ఈఎంఐ చేతికి వచ్చే నికర ఆదాయంలో 3040 శాతానికి మించకుండా చూసుకోవడం మంచిది. గృహరుణం సాధారణంగా 1520 ఏళ్ల కాలానికి ఉంటుంది. అందువల్ల ప్రారంభంలోనే ఎక్కువ ఈఎంఐ పెట్టుకుంటే, దీర్ఘకాలం ఆర్థిక ఒత్తిడి కొనసాగుతుంది. జీతం పెరిగినా పిల్లల చదువులు, వైద్యం ఇతర కుటుంబ ఖర్చులూ కాలక్రమంలో పెరుగుతాయి. కాబట్టి, ఇంటి రుణంతోపాటు, ఇతర ఆర్థిక లక్ష్యాలకూ తగినంత డబ్బు కేటాయించేలా బడ్జెట్‌ను రూపొందించుకోవాలి.

**భారం పెరిగితే..**

* కాలపరిమితి: రుణ కాలాన్ని పెంచితే, నెలవారీ ఈఎంఐ తగ్గుతుంది. మొత్తం చెల్లించే వడ్డీ పెరుగుతుంది. తాత్కాలికంగా నగదు ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు ఇది ఉపశమనం కలిగిస్తుంది. తక్కువ వడ్డీకి బదిలీ: మరో బ్యాంకు లేదా ఆర్థిక సంస్థ తక్కువ వడ్డీ రేటుతో రుణం ఇస్తుంటే రుణ బదిలీ (బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్) పరిశీలించవచ్చు. బదిలీకి సంబంధించిన ఛార్జీలు, కొత్త రుణ నిబంధనలనూ లెక్కలోకి తీసుకోవాలి.
* ముందే చెల్లించాలి: బోనస్, అదనపు ఆదాయం లేదా పెట్టుబడి గడువు ముగిసి వచ్చిన సొమ్ములో కొంత మొత్తాన్ని రుణ అసలుకు చెల్లిస్తే, వడ్డీ భారం తగ్గుతుంది. రుణ కాలాన్నీ తగ్గించుకోవచ్చు.
* మరో రుణం: ఇంటి రుణంపై టాపప్ తీసుకునే అవకాశం ఉంటుంది. దీన్ని తీసుకొని, ఇతర అప్పులు తీర్చేయొచ్చు. దీనివల్ల ఎక్కువ వడ్డీ ఉన్న అప్పుల భారం వదిలించుకోవచ్చు. ఒకే చోట పెద్ద అప్పు 89 శాతం మధ్యలోనే ఉంటుంది. కానీ, ఇది చివరి మార్గంగా మాత్రమే పరిశీలించడం మంచిది.
* సొంతిల్లు ఉండటం ముఖ్యమే. దాని కోసం తీసుకున్న రుణం వల్ల కుటుంబ ఆర్థిక లక్ష్యాలు దెబ్బతినకుండా చూసుకోవడం మరింత ముఖ్యం. ఇల్లు కొనేముందు ఈఎంఐతోపాటు, ఇతర ఖర్చులు, భవిష్యత్తు అవసరాలనూ చూసుకున్నాకే, తగిన నిర్ణయం తీసుకోవాలి.

# అభిషేక్ వీర విహారం.. అఫ్గాన్‌తో మూడో టీ20లో భారత్ ఘన విజయం

ఢిల్లీ: అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ 127 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను టీమ్‌ఇండియా (Team India) క్లీన్‌స్వీప్ చేసింది. అభిషేక్ శర్మ 108 (34 బంతుల్లో), సంజు శాంసన్ 50 (35 బంతుల్లో) అదరగొట్టడంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 221/7 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో అఫ్గాన్ 14.1 ఓవర్లలో 94 పరుగులకే కుప్పకూలింది. ఇబ్రహీం జద్రాన్ (25) టాప్ స్కోరర్. అజ్మతుల్లా ఒమర్జాయ్ 17, రహ్మనుల్లా గుర్బాజ్ 15, నూర్ ఉల్ రెహ్మాన్ 11 పరుగులు చేశారు. భారత బౌలర్లలో నితీశ్ రెడ్డి ఒకే ఓవర్లో మూడు వికెట్లు




పడగొట్టాడు. రవి బిష్ణోయ్ 3, అక్షర్ పటేల్ 2, బుమ్రా, యశ్ ఠాకూర్ ఒక్కో వికెట్ తీశారు. అఫ్గాన్‌తో మూడో టీ20లో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 221/7 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 108 (34 బంతుల్లో), సంజు శాంసన్ 50 (35 బంతుల్లో) అదరగొట్టారు. శ్రేయస్ అయ్యర్ (29), శివమ్ దూబె (14), ఇషాన్ కిషన్ (10), అక్షర్ పటేల్ (5*), తిలక్ వర్మ (2), నితీశ్ రెడ్డి (1) పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 2 వికెట్లు, అబ్దుల్లా అహ్మద్జాయ్, రషీద్ ఖాన్ చెరో వికెట్ తీశారు. అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న మూడో టీ20లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ (Abhishek Sharma) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. 30 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఇందులో 96 పరుగులు .. 10 సిక్సులు, 9 ఫోర్ల రూపంలోనే రావడం గమనార్హం. మొత్తంగా అంతర్జాతీయ టీ20ల్లో ఇది మూడో ఫాస్టెస్ట్ సెంచరీ. తొలి రెండు స్థానాల్లో వరుసగా ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ (27 బంతులు), టర్కీకి చెందిన ముహమ్మద్ ఫహాద్ (29 బంతులు) ఉన్నారు. భారత జట్టు పరంగా చూస్తే ఇది ఫాస్టెస్ట్ సెంచరీ. అంతకు ముందు 2017లో రోహిత్ శర్మ శ్రీలంకతో మ్యాచ్‌లో 35 బంతుల్లో సెంచరీ చేశాడు.

**పవర్ ప్లే రికార్డు కూడా...**

అదే విధంగా టీ20 పవర్ ప్లేలో అత్యధిక పరుగుల రికార్డును అభిషేక్ శర్మ సంజు శాంసన్ జోడీ బద్దలుకొట్టింది. తొలి ఆరు ఓవర్లలో 100 పరుగులు చేసింది. భారత టీ20 క్రికెట్‌లో ఇదే అత్యధికం. 2025లో ఇంగ్లాండ్‌పై చేసిన 95/1 ఇప్పటివరకు మన టాప్ పవర్ ప్లే స్కోర్. మొత్తంగా చూస్తే.. ఈ రోజు పవర్‌ప్లేలో సాధించిన స్కోరు మూడో అత్యధికం. తొలి రెండు స్థానాల్లో 113/0 (AUS vs SCO), 102/0 (SA vs WI) ఉన్నాయి.




## ఆసియా గేమ్స్..
# చిన్న జట్టుపై అతికష్టంగా గెలిచిన పాక్

ఆసియా క్రీడలను వర్షం ఇబ్బంది పెడుతోంది. ఉదయం జరిగిన క్రికెట్ మ్యాచ్ రద్దవ్వగా.. ఇక రెండో మ్యాచ్‌ను ఓవర్లకు కుదించి ఆడించాల్సిన పరిస్థితి నెలకొంది. చైనా బంగ్లా మ్యాచ్ టాస్ కూడా పడకుండానే రద్దైంది. దీంతో మెరుగైన ర్యాంకింగ్ కారణంగా బంగ్లా సెమీస్‌లోకి అడుగు పెట్టింది. ఐసీసీ ర్యాంకుల్లో బంగ్లాది 10వ స్థానం. చైనాది 36వ ప్లేస్. దీంతో బంగ్లా నేరుగా సెమీస్‌కు చేరుకుంది. శుక్రవారం భారత్ జపాన్ విజేతతో బంగ్లా సెమీఫైనల్‌లో తలపడనుంది. మరో క్వార్టర్స్‌లో పాక్ అతికష్టంగా విజయం సాధించింది.




**ఓటమి అంచు వరకూ..**

ఇక రెండో మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో పాకిస్థాన్ తలపడింది. ఈ మ్యాచ్‌కూ వర్షం అంతరాయం కలిగించింది. ఔట్‌ఫీల్డ్ చిత్తడిగా మారడంతో మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన థాయ్‌లాండ్ 4 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పాక్ ఇబ్బంది పడింది. ఆసియా కప్‌లో పరాభవంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పాక్‌కు.. మరోసారి అలాంటి పరిస్థితి తప్పదా? అన్నట్లుగా మారింది. అయితే, మరో రెండు బంతులు మాత్రమే మిగిలి ఉండగా అతి కష్టం మీద విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. చివరికి 10.4 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 92 పరుగులు చేసి గెలిచింది. శుక్రవారం మలేషియా శ్రీలంక మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుతో పాకిస్థాన్ సెమీస్‌లో తలపడనుంది.

# గంగూలీ బయోపిక్ షూటింగ్.. ఇంగ్లాండ్ క్లబ్‌కు రూ.6 లక్షలు జరిమానా!

ఇంగ్లాండ్‌లోని ఓ కౌంటీ క్లబ్‌కు పడిన జరిమానాకు పరోక్షంగా భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ బయోపిక్ (Sourav Ganguly Biopic) షూటింగ్ కారణమైంది. దాదాపు రూ. 6 లక్షల జరిమానాతోపాటు 27 పాయింట్ల కోత పడింది. గత ఆగస్ట్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ సందర్భంగా పిచ్ నాణ్యత దారుణంగా ఉందని తాజాగా రిపోర్ట్ వచ్చింది. లీసెస్టర్‌షైర్ గ్లామోర్గాన్ జట్ల మధ్య డివిజన్ 1 మ్యాచ్ జరిగింది. గ్లామోర్గాన్‌పై లీసెస్టర్‌షైర్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. కానీ, పిచ్ అత్యంత దారుణంగా ఉందని కౌంటీ క్రమశిక్షణ ప్యానెల్ 'పూర్' రేటింగ్‌ను ఇచ్చింది. అయితే, పిచ్‌ను సరిగ్గా సిద్ధం చేయలేకపోవడానికి పలు కారణాలు ఉన్నాయని గ్రౌండ్స్‌మన్ కాల్లమ్ లూయిన్ తెలిపారు. తొలుత షెడ్యూల్‌లో లేని బాలీవుడ్ సినిమా చిత్రీకరణ కూడా ఒక అంశమని వెల్లడించారు. "ఆ మ్యాచ్‌కు పది వారాల ముందు రెండు టీ20లు జరిగాయి. దీంతో డివిజన్ 1 మ్యాచ్ కోసం ఈ పిచ్‌నే వాడాం. ఆ సమయంలో వాతావరణం కూడా చాలా ఇబ్బంది పెట్టింది. దాదాపు 35 డిగ్రీల ఎండ ఉంది. అనుకోకుండా బాలీవుడ్‌కు చెందిన ఓ సినిమా చిత్రీకరణ కూడా ఈ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందే ఇక్కడ జరిగింది. దీంతో పిచ్‌మీద పని చేసేందుకు నన్ను అనుమతించలేదు. కనీసం కవర్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది" అని లూయిన్ తెలిపారు. గ్రౌండ్‌మన్ చెప్పిన సినిమా గంగూలీ



బయోపిక్ అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. కమిటీ నిర్ణయంపై అప్పీలు చేసుకొనేందుకు లీసెస్టర్‌షైర్‌కు 10 రోజుల సమయం ఉంది. తప్పకుండా దీనిపై రివ్యూ చేయమని కోరతామని క్లబ్ వెల్లడించింది.

# డాక్టర్ బాబు అయ్యాడు మారథాన్ రన్నర్.. రెండేళ్లలోనే ఆసియా గేమ్స్‌కు..

చిన్నప్పటి నుంచి అథ్లెట్ కావాలనే కల.. కుటుంబ సభ్యులు మాత్రం చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని నచ్చజెప్పారు. సరే.. వారి మాటకు విలువనిచ్చి మెడిసిన్ చదివేందుకు విదేశాలకు వెళ్లాడు. అనుకోకుండా మొదలుపెట్టిన రన్నింగ్.. తనలోని అథ్లెట్‌ను నిద్రలేపింది. ఓ వైపు చదువు పూర్తై డాక్టర్ అయినా.. మారథాన్ రన్నర్‌గా మారిపోయాడు. తొలిసారి ఆసియా గేమ్స్‌లో అడుగుపెట్టిన ఆర్థోపెడిక్ సర్జన్ కార్తిక్ కార్కేరా (Kartik Karkera) స్ఫూర్తివంతమైన స్టోరీ ఇది.

**రష్యాలోనే బీజం..**

ముంబయికి చెందిన 29 ఏళ్ల కార్తిక్ వైద్యవిద్య కోసం 2016లో రష్యా వెళ్లాడు. ఆ తర్వాత మూడేళ్లపాటు రన్నింగ్ వైపు దృష్టిపెట్టలేదు. ఎప్పుడైతే కరోనా విజృంభించిందో కార్తిక్‌కు కాలేజీకి వెళ్లే పనిలేకుండా పోయింది. ఆన్‌లైన్‌లోనే చదవాల్సిన పరిస్థితి. దీంతో ఫిట్‌నెస్ కోసం యూనివర్సిటీలోని 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను వినియోగించడం మొదలుపెట్టాడు. కొన్నిసార్లు రోజుకు దాదాపు 20 నుంచి 25 కి.మీల వరకూ ఒంటరిగానే పరుగుపెట్టేవాడు. 2021, 2022లో రష్యా యూనివర్సిటీలో 1500 మీటర్ల రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. అందులో విజయం సాధించాడు. ఒలింపిక్ ఛాంపియన్ యురీ బొర్జాకోవిస్కీతో కలిసి పనిచేశాడు. దీంతో 2023లో మాస్కో హాఫ్ మారథాన్ (21k)లో పోటీపడి ఆరో ప్లేస్ సాధించాడు. ఆ మరుసటి ఏడాదే అతడు భారత్‌కు తిరిగి వచ్చాడు. అప్పటికి ఇతని గురించి ఇక్కడెవరికీ పెద్దగా తెలియదు.

**కేవలం రెండేళ్లలోనే..**

సంకల్పం ఉంటే ఎంతటిదానినైనా సాధించవచ్చని కార్తిక్ (Kartik Karkera) నిరూపించాడు. పెద్ద ఈవెంట్లలో పాల్గొనాలని చిన్నప్పటి నుంచే చాలా మంది తర్ఫీదు పొందుతుంటారు. కానీ, కార్తిక్ పరిస్థితి భిన్నమైంది. దాదాపు 22 ఏళ్ల వయసులో మారథాన్‌లోకి అడుగు పెట్టిన అతడు.. డాక్టర్ పట్టా చేతబట్టుకొని ఇండియాకు వచ్చాడు. రష్యాలో పలు మారథాన్లలో పాల్గొన్నా.. ఇక్కడి వచ్చాక నాశిక్‌లోని ఓ ఆసుపత్రిలో రెసిడెంట్‌గా చేరాల్సి వచ్చింది. తన షిఫ్ట్‌లను బ్యాలెన్స్ చేసుకుంటూనే మారథాన్ ట్రైనింగ్‌లో పాల్గొనేవాడు. అందుకోసం నిద్రనూ త్యాగం చేసిన సందర్భాలు అనేకం. అతడు పడిన శ్రమకు ప్రతిఫలం రెండేళ్లలోనే వచ్చింది. దిల్లీ మారథాన్‌ను 2:13:10 గంటలు, టాటా ముంబయి మారథాన్‌ను 2:19:55 గంటల్లో పూర్తి చేసి బెస్ట్ రన్నర్‌గా పేరొందాడు.

# ఇక్కడ తీర్పులు చెప్పేటోళ్లే ఎక్కువ

టాలీవుడ్‌లో తెలుగు అమ్మాయిలకు ఎదురవుతోన్న వివక్షపై అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ రియాక్ట్ అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్లూయెన్సర్ అహల్య పెట్టిన సోషల్ పోస్టుకు ఆమె రిప్లై ఇచ్చింది. "అందరిలా కాకుండా వినూత్నంగా ఏదైనా చేయాలని కలలు కనేవారిని విమర్శించే ధోరణి మనవాళ్లలో చాలా ఉంటుంది. నిరుత్సాహపరచడం మనవాళ్లకే అలవాటే. ప్రోత్సహించేవాళ్ల కంటే తీర్పులు చెప్పేవాళ్లే ఎక్కువగా కనిపిస్తారు. ఇక్కడి వాతావరణం నచ్చకే నేను ఇంటికి దూరమయ్యా. 16 ఏళ్లకే ముంబై వెళ్లిపోయా. సక్సెస్ అవుతానో లేదో నమ్మకం లేకపోయినా రిస్క్ తీసుకోవడమే మంచిది అనిపించింది" అని శోభిత అన్నది. దీంతో ఆమె కామెంట్స్ వైరల్ అవుతోన్నాయి. టాలీవుడ్ ఇండస్ట్రీని ఉద్దేశించే శోభిత ఈ కామెంట్లు చేసిందని నెటిజన్లు అంటున్నారు. కాగా ప్రస్తుతం తమిళంలో పా రంజిత్ దర్శకత్వంలో వెట్టువమ్ సినిమా చేస్తోంది ఈ అందగత్తె.



# బోల్డ్ పాత్రలో శృతి

మూడేళ్ల తర్వాత ఓ బోల్డ్ రోల్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది శృతి హాసన్. సీతారామం, లక్కీ భాస్కర్ బ్లాక్‌బస్టర్స్ తర్వాత దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తోన్న ఆకాశంలో ఒక తార మూవీలో కీలక పాత్రలో కనిపించబోతోంది. ఆస్ట్రోనాట్ కావాలని కలలు కనే ఓ పల్లెటూరి యువతి కలను నెరవేర్చే క్రమంలో ఆమెను ప్రాణంగా ప్రేమించిన యువ కుడికి ఎదురయ్యే పరిణామాలతో ఎమోషనల్ లవ్ డ్రామాగా ఈ మూవీ తెరకెక్కుతోంది. నవంబర్ 20 ఈ మూవీ థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీతో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది.



# షూటింగ్ కంప్లీట్..

సినిమా



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న రణబాలి షూటింగ్ పూర్తయ్యింది. ఈ విషయాన్ని డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తన టీమ్ 130 రోజుల కష్టానికి నిదర్శనంగా ఈ మూవీ నిలుస్తుందన్నారు. నూతన వధూవరులుగా విజయ్, రష్మిక కనిపిస్తున్న ఈ పోస్టర్ వైరలవుతోంది. బ్రిటీషర్లను ఎదురించి పోరాడిన రాయలసీమకు చెందిన ఓ యోధుడి కథతో తెరకెక్కుతోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 16న ఈ మూవీ థియేటర్లలోకి రాబోతుంది.

# అందగాడంటే అతడే



కియారా అద్వానీ భర్త సిద్ధార్థ్ మల్హోత్రాపై మిల్కీ బ్యూటీ తమన్నా ప్రశంసలు కురిపించింది. వీరిద్దరు జంటగా నటించిన ది వాన్ మూవీ ట్రైలర్ లాంచ్‌లో ఆమె మాట్లాడుతూ పొగడ్తలతో ముంచెత్తింది. "హ్యాండ్‌సమ్ అనే బిరుదుకు అర్హుడు సిద్ధార్థ్. 20 ఏళ్ల కెరీర్‌లో నేను పనిచేసిన హీరోల్లో చాలా అందగాడు. సెట్స్‌లో అతడి మర్యాద, అభిమానం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్క్రీన్‌పై చాలా డాషింగ్‌గా, రెబెల్ అటిట్యూడ్‌తో కనిపిస్తారు. కానీ రియల్‌లైఫ్‌లో మాత్రం సెన్సిటివ్ పర్సన్. ఎవరిని ఇబ్బంది పెట్టడు. అతడితో పనిచేసిన జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేను" అని అన్నది. ఈ మూవీకి పంచాయత్ వెబ్‌సిరీస్ ఫేమ్ దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహించాడు. ఏక్తా కపూర్‌తో కలిసి టీవీఎఫ్ సంస్థ ఈ సినిమాను నిర్మించింది.

# ఫస్ట్ టైమ్ చిరుకి జోడీగా





మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న కాక మూవీపై ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇందులో సీనియర్ హీరోయిన్ స్నేహ కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో చిరంజీవి భార్యగా స్నేహ కనిపించబోతున్నట్లు సమాచారం. చిరుతో నటించాలన్న ఆమె కోరిక ఎట్టకేలకు తీరబోతోందట. వినయవిధేయరామ మూవీలో రామ్‌చరణ్ వదినగా కనిపించిన స్నేహ దాదాపు ఏడేళ్ల తర్వాత మళ్లీ మెగాస్టార్ మూవీతో రీఎంట్రీ ఇవ్వబోతుండటం ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో నివేథా పేతురాజ్, అనస్వర రాజన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తోండగా సంక్రాంతికి కానుకగా జనవరి 13న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.